ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 4 జనవరి 2025



స్టీల్‌ప్లాంటులో కూలిన కన్వేయర్ గ్యాలరీ

- బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఉత్పత్తిపై ప్రభావం

... మెయిన్ 3లో




కూలిపోయిన సింటర్ ప్లాంట్ కన్వేయర్ గ్యాలరీ



నేవీ విన్యాసాలకు సిద్ధమైన ప్రధాన వేదిక

నేడు నేవీ విన్యాసాలు





ఆర్కే బీచ్‌లో ఆపరేషన్ డెమో

- ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- కుటుంబ సమేతంగా హాజరుకానున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం శనివారం సాయంత్రం రామకృష్ణా బీచ్‌లో సాహస విన్యాసాల ప్రదర్శన (ఆపరేషన్ డెమో) నిర్వహించనుంది. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా వస్తున్నారు. .

ఏటా డిసెంబరు 4న నేవీ డే నిర్వహించి, అదేరోజు సాయంత్రం బీచ్‌లో సాహస విన్యాసాలు ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి (2024) ఈ విన్యాసాలను ఒడిశా రాష్ట్రంలోని పూరీ బీచ్‌లో నిర్వహించగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరయ్యారు. విశాఖ ప్రజల కోసం నేవీ అధికారులు శనివారం ఆర్‌కే బీచ్‌లో ప్రదర్శన ఏర్పాటుచేశారు. దీనికి సీఎంను ఆహ్వానించారు. ఆయన శనివారం మధ్యాహ్నం 2.40 గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో బయలుదేరి 3.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం 4.15 గంటలకు బయలుదేరి 4.40 గంటలకు ఆర్కే బీచ్‌కు చేరుకుంటారు. 6.10 గంటల వరకు నేవీ విన్యాసాలు వీక్షిస్తారు. తిరిగి బీచ్ నుంచి 6.15 గంటలకు బయలుదేరి 6.50 గంటలకు ... మిగతా 6వ పేజీలో

ప్రధాని సభకు విస్తృత ఏర్పాట్లు



1.7 లక్షల మంది సమీకరణ

- విశాఖ జిల్లా నుంచి లక్షా 30 వేల మంది, అనకాపల్లి జిల్లా నుంచి 40,000 మంది
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్
- 22 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్: సీపీ
- సంపత్ వినాయక్ ఆలయం వద్ద నుంచి రోడ్‌షో
- అక్కడ నుంచి విద్యుత్ దీపాలతో అలంకరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల ఎనిమిదో తేదీన జరగనున్న ప్రధాని నరేంద్రమోదీ సభకు 1.7 లక్షల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ తెలిపారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విశాఖ నుంచి కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన సమీకరణ గురించి కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరం నుంచి 1.2 లక్షల మంది, నాలుగు గ్రామీణ మండలాల నుంచి పది వేల మంది,

... మిగతా 6వ పేజీలో



ప్రధానమంత్రి మోదీ పర్యటన ఏర్పాట్లపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష

- సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దాం
- ఏర్పాట్లు పక్కాగా చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల ఎనిమిదో తేదీన జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా రాష్ట్రానికి ప్రధాని వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరం కలిసి పనిచేద్దామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రెండు లక్షల మంది ప్రధాని సభకు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల నుంచి వచ్చే వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో ఆయా జిల్లాల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. నగరంలో పార్కింగ్ ప్రాంతాల వివరాలు తెలిపేలా బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. రియల్ టైమ్ లొకేషన్ సమాచారం ఉండేలా సీసీ టీవీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి కార్యాలయ సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, ప్రభుత్వ విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి, పల్లా, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ, ఎమ్మెల్సీ రామారావు,వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, గండి బాబ్జీ, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, డీసీపీ అజిత వేజెండ్ల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ చేతిలోనే ఫిల్మ్ క్లబ్!

నాలుగేళ్ల క్రితం తమకు నచ్చిన వారితో కోర్ కమిటీని నియమించుకున్న ఆ పార్టీ పెద్దలు

అంతా సినీ పరిశ్రమకు సంబంధం లేనివారే...

- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అందరినీ తప్పుకోవాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే గంటా ఆదేశం
- అయినా ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన
- సభ్యులకు తెలియకుండా ఇష్టానుసారం నిధుల వ్యయం
- న్యూ ఇయర్ ఈవెంట్‌కు రూ.23 లక్షల ఖర్చు
- అన్ని ఈవెంట్లలోను కార్యవర్గ సభ్యులకు కమీషన్లు
- పేకాట క్లబ్బుగా మార్చారనే విమర్శలు



ఫిల్మ్ క్లబ్ భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భీమిలి సమీపానున్న ఫిల్మ్ క్లబ్ (వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్) ఇంకా వైసీపీ వర్గం ఆధ్వర్యంలోనే నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా వైసీపీ నేతల పెత్తనమే కొనసాగుతోంది. కార్యవర్గం రాజీనామా చేసి తప్పుకోవాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హెచ్చరించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం ఉన్న కార్యవర్గం నిధులు దుర్వినియోగం చేస్తోందనే ప్రచారం జరుగుతోంది.

వైసీపీ ప్రభుత్వ హయాం (2020)లో ఆ పార్టీ పెద్దలు ఈ క్లబ్ కమిటీ నుంచి చిత్ర పరిశ్రమకు చెందిన వారిని తప్పించేశారు. కోర్ కమిటీని వేశారు. నాటి సీఎం సామాజిక వర్గానికి చెందిన వారిని, సాయిరెడ్డి బంధువులను ఎన్నిక లేకుండానే ప్రధాన కార్యవర్గంగా పెట్టుకున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి కాయల వెంకటరెడ్డి ప్రస్తుతం క్లబ్ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ రాజు జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. ఆయన క్లబ్ సభ్యత్వ రుసుము కట్టకుండానే వ్యవహారాలన్నీ తన కనుసన్నల్లో నడిపిస్తున్నారు.

ఎమ్మెల్యే గంటా చెప్పినా వినకుండా

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ క్లబ్ వ్యవహారాలు తెలుసుకొని నాలుగు నెలల క్రితం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సినిమా పరిశ్రమకు చెందినవారు ఎవరూ క్లబ్ కార్యవర్గంలో లేరని గుర్తించి ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే కార్యవర్గం స్వచ్ఛందంగా

... మిగతా 6వ పేజీలో

పేకాట క్లబ్‌గా...

- కల్చరల్ సెంటర్‌ను పూర్తిగా పేకాట క్లబ్బుగా మార్చేశారు. సీనియర్ సిటిజన్ల కాలక్షేపానికి పేకాట ఆడుకుంటారని, అనుమతి ఇవ్వాలని కోరుతూ ఇంతకు ముందు పనిచేసిన కలెక్టర్ మల్లికార్జునకు ఒక లేఖ సమర్పించి..పేకాటకు తెర లేపారు. కలెక్టర్ అనుమతి ఇవ్వకపోయినా పేకాట ఇప్పటికీ నిర్వహిస్తున్నారు. క్లబ్ కార్యవర్గంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి బాగా పేకాట పిచ్చి. టేబుల్‌కు పది లక్షల రూపాయలు బెట్ కడుతున్నారంటే అక్కడ ఏ స్థాయిలో పేకాట జరుగుతున్నదో అంచనావేసుకోవచ్చు.

కూటమికి దగ్గరయ్యేందుకు కాయల యత్నం

- ఇటీవల విజయవాడలో వరదలు వచ్చినప్పుడు క్లబ్ తరపున కాయల వెంకటరెడ్డి రూ.25 లక్షలు విరాళం ఇచ్చారు. విరాళం ఇస్తున్నట్టు క్లబ్ సభ్యులకు ముందుగా చెప్పక పోవడం గమనార్హం. ఈ విరాళం ద్వారా కూటమి ప్రభుత్వానికి దగ్గర అవ్వాలనేది ఆయన ఆలోచనగా చెబుతున్నారు.

అనకాపల్లి జిల్లాలో విమానాశ్రయం?

- అధికారులతో సమీక్ష సమావేశంలో సీఎం
- నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటుకు ప్రతిపాదన

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుచేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ప్రతి జిల్లాలో విమానాశ్రయం ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల విస్తరణ, కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉండవల్లిలో సమీక్ష జరిపారు.

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో భారీ స్టీల్ ప్లాంటు, బల్క్ డ్రగ్ పార్కు, అచ్యుతాపురం సమీపాన ఎన్‌టీపీసీ హైడ్రోజన్ ప్లాంటు ఏర్పాటు కానున్నందున విమానాశ్రయం అవసరం ఉందని ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు అభిప్రాయపడ్డారు. భోగాపురంలో విమానాశ్రయం పూర్తయితే విశాఖ విమానాశ్రయంలో కార్యకలాపాలు ఆగిపోయే అవకాశం ఉంది. అప్పుడు అనకాపల్లి జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు భోగాపురం వెళ్లాల్సి ఉంటుంది. అంత దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో ఏపీఐఐసీ ఆధీనంలో ఐదు వేల ఎకరాలు ఉంది. మిట్టల్ స్టీల్ ప్లాంటు, బల్క్ డ్రగ్ పార్కుకు కేటాయించగా మిగిలిన భూమిలో విమానాశ్రయం ఏర్పాటయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. విమానాశ్రయం ఏర్పాటు, స్థల సేకరణపై ఇంకా తమకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదని అనకాపల్లి జిల్లా అధికారులు చెబుతున్నారు.

రేపే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు



శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహణ

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి', ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు...గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)'కు సీతమ్మ ధారలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణం వేదిక కానున్నది. ఈ నెల ఐదో తేదీ...ఆదివారం ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.4 వేలు, రూ.3 వేలు బహుమతిగా అందించనున్నారు. ముగ్గు, రంగులు వగైరా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ (9985411659, 9492452283) చేయించుకోవాలి. పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో ముందుగా వచ్చిన వారికి మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం లభించనుంది.

మంత్రి లోకేశ్ రాక రేపు



విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఆదివారం ఉదయం నగరానికి వస్తున్నారు. ఈనెల ఎనిమిదో తేదీన ప్రధాని రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించి ప్రధాని సభకు జన సమీకరణపై చర్చిస్తారు. అనంతరం విజయవాడ వెళతారు. తిరిగి ఏడో తేదీ రాత్రి నగరానికి వచ్చి ఎనిమిదో తేదీన ఐటీ సదస్సులో పాల్గొంటారు. అనంతరం ప్రధాని సభకు హాజరవుతారు.

మహా గోప్యం!



- జీవీఎంసీలో బిల్లుల చెల్లింపు వివరాలు రహస్యం
- ఇతర అధికారులకూ తెలియకుండా కట్టుదిట్టం
- పోర్టల్‌లో మార్పులు చేసిన యంత్రాంగం
- ఐటీ, అకౌంట్స్ విభాగాలతోపాటు ఏడీసీకి మాత్రమే యాక్సిస్
- బిల్లుల చెల్లింపు అక్రమాలను ఇటీవల వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- దీంతో స్టేటస్ ఇతరులు చూసేందుకు వీలు లేకుండా చర్యలు
- తప్పులు కప్పిపుచ్చుకునే దిశగా యత్నాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సిబ్బంది తప్పు చేస్తే మరోసారి పునరావృతం కాకుండా చూడాలని అధికారులు మందలించాలి. కానీ ఘనత వహించిన మహా విశాఖ నగర పాలక సంస్థ అధికారులు అక్రమాలు వెలుగుచూస్తే సరిదిద్దుకోవడంపై దృష్టిపెట్టకుండా, అవి బయటపడకుండా చర్యలు తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇందులో భాగంగా జీవీఎంసీలోని ఇతర అధికారులకు కూడా తెలియకుండా పోర్టల్‌ను కట్టుదిట్టం చేయడం విశేషం.

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. వీటిని చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి సంబంధిత అధికారులు, స్టాండింగ్ కమిటీ, జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదంతో టెండర్లు పిలుస్తారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ పనులు పూర్తిచేసిన తర్వాత ఎం-బుక్‌లో నమోదు చేసి, బిల్లు కోసం సంబంధిత జోన్ డ్రాయింగ్ బ్రాంచి (డీబీ) ద్వారా కమిషనర్‌కు సిఫారసు చేస్తారు. ఎం-బుక్ రికార్డింగ్ జరిగి డీబీకి చేరిన తర్వాత అక్కడ అధికారులు వాటిని పరిశీలించి బిల్లు సిద్ధం చేస్తారు. అనంతరం జనరల్ ఓచర్ (ఈపీ నంబరు) ఇస్తారు. ఓచర్ నంబరు సీరియల్ ఆధారంగా ... మిగతా 6వ పేజీలో



క్రికెట్ ఆడుతున్న కమాండెంట్ మురళీకృష్ణ

కొనసాగుతున్న క్రీడా పోటీలు

కొమ్మాది,జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో జరుగుతున్న క్రీడా వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం క్రికెట్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, షార్ట్ పుట్, లాంగ్ జంప్, హైజంప్, జూవెలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ క్రికెట్ ఆడి సిబ్బందిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్ పద్మనాభ రాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు పి. సత్యం, వి. నారాయణరావు, బి. రామకృష్ణ, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

పద్మనాభం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా జరుగుతోంది. నాయకులు శుక్రవారం అనంతవరం, గొల్లలపాలెం గ్రామాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.అధిష్ఠానం మరో 15 రోజులు గడువు పొడిగించడంతో నాయకులు సభ్యత్వ నమోదును వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్ కుమార్, గొర్రెపాటి పెద ఎర్నినాయుడు, రొంగలి అప్పల సూర్యనారాయణ, ఎస్. వెంకటరావు, తాతాజీ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'హైందవ శంఖారావం సభకు తరలిరండి'

పద్మనాభం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావాన్ని ప్రజలు విజయవంతం చేయాలని స్థానిక విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ గాడు వెంకటనారాయణ, బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి పిలుపునిచ్చారు. శుక్రవారం వారు పద్మనాభం, రేవిడి, అనంతవరం, పెంట, కొవ్వాడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాలపై ప్రభుత్వాల అజమాయిషీని పూర్తిగా తొలగి వరకు తాము చేపట్టిన ఉద్యమం ఆగదన్నారు.

సింహాచలం : హైందవ శంఖారావం సభకు ప్రజలు తరలిరావాలని కోరుతూ 98వ వార్డు బీజేపీ అధ్యక్షుడు రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు.

సింగనబందలో రెవెన్యూ సదస్సు బహిష్కరణ

» సభకు రెండు గంటలు ఆలస్యంగా వచ్చిన అధికారులు
» యంత్రాంగానికి వ్యతిరేకంగా గ్రామస్థుల నినాదాలు

భీమునిపట్నం (రూరల్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సభలను మొక్కుబడిగా జరుపుతున్నారు. ఇందుకు శుక్రవారం సింగనబంద గ్రామంలో జరిగిన సంఘటనే నిదర్శనం. ఈ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహణకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 గంటలకు జరగవలసిన సదస్సుకు 11.30 అయినా అధికారులెవరూ హాజరుకాలేదు. ఆలస్యంగా వచ్చిన వారిలోనూ దిగువ స్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు.దీంతో గ్రామస్తులు, అధికార పార్టీ నాయకులు సదస్సును బహిష్కరించారు.జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ఆధ్వర్యంలో సర్పంచ్ నారాయణ, రైతులు అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయాలని బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉదయం 11.30 గంటల వరకూ అధికారులెవరూ రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో గ్రామంలో జరిపిన భూముల రీసర్వే వల్ల



అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

రైతులకు చాలా నష్టం జరిగిందని, ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదు చేశారని ఆయన తెలిపారు. ల్యాండ్ పొజిషన్ నంబరు (ఎల్‌పీఎం) ఒక భూమికి ఒక నంబరు ఇవ్వాల్సి ఉండగా అయిదుగురు రైతులకు ఒకే నంబరు కేటాయించడం వల్ల గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. దాదాపు అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉందని, అధికారులకు ఎంత మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెండు నెలల క్రితం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు పెట్టుకున్న ఒక్క దరఖాస్తును కూడా ఇంతవరకూ పరిష్కరించలేదన్నారు. ఈవిషయాలన్నీ రైతులు నిలదీస్తారని అధికారులు ముఖం చాటేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాగా సదస్సుకు వచ్చిన రెవెన్యూ సిబ్బందికి గ్రామస్తులు దరఖాస్తులు ఇవ్వకపోవడంతో వారు సభను ముగించి వెళ్లిపోయారు.

దుర్గాలమ్మ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

కొమ్మాది, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నగరంలోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతితాతారావు, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, జగ్గుపల్లి నాని, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఫొటో ట్రేడ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఫొటోగ్రాఫర్లు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పీఎంపాలెం వి. కన్వెక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఫొటో ట్రేడ్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పరంగా ఫొటోగ్రఫీ ఒక పరిశ్రమగా వృద్ధి చెందడం శుభపరిణామమన్నారు.తనకు ఫొటోగ్రఫీ అంటే చాలా ఇష్టమని తెలిపారు. అనంతరం ట్రేడ్ షోలో ప్రదర్శించిన పలు కెమెరాలను పరిశీలించి, వాటి ప్రత్యేకతను తెలుసుకున్నారు.

ఆర్‌జేడీ కార్యాలయంలో...

మధురవాడ : ఏపీ పాఠశాలల విద్యా సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా నూతన క్యాలెండర్‌ను మధురవాడలోని ప్రాంతీయ విద్యా కార్యాలయంలో ఆర్‌జేడీ బి. విజయభాస్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పి.ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎం. శైలజా కుమారి, కోశాధికారి కృష్ణ చైతన్య, సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు కె. ముత్యాలరావు, విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బీవీ నరసింగరావు పాల్గొన్నారు.

గోదాదేవికి తిరుప్పావై పాశుర విన్నపాలు

సింహాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై, కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వేకువజామున ప్రభాతారాధలు యథావిధిగా పూర్తిచేసి అమ్మవారి ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించారు. ఆలయ బేడామండపంలో తిరువీధి ఉత్సవం ఘనంగా జరిపారు. అనంతరం ఆండాళ్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక సేవాకాలం జరిపి పండితులు తిరుప్పావైలోని 19వ పాశురాన్ని విన్నపాలు జరిపారు.

గెడ్డను పరిశీలించిన కూటమి నాయకులు

మధురవాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గెడ్డల పరిరక్షణకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరారు. శుక్రవారం వారు ఏడో వార్డులోని మధురవాడ సర్వే నంబరు 47, 54లో ఉన్న ప్రధాన గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంపాలెంలో ఉన్న గెడ్డ ఇప్పటికే ఆక్రమణలతో బక్కచిక్కిందని, అధికారులు ఆక్రమణలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయుడు పిళ్లా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎవాంటెల్‌తో గీతం అవగాహన ఒప్పందం

సాగర్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :అంతరిక్షం, దేశ రక్షణ, కమ్యూనికేషన్ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రముఖ సంస్థ ఎవాంటెల్‌తో గీతం వర్సిటీ శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు గీతం ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, ఎవాంటెల్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గీతం అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాధిక, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ కామేశ్వరరావు, డాక్టర్ జీవీకే శర్మ, పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

సింహాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :బీఆర్‌టీఎస్ కారిడార్ అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వార్డు కార్పొరేటర్ పివి నరసింహం కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి ఆనుకుని జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.



తిరువీధిలో పల్లకిలో ఊరేగుతున్న గోవిందరాజస్వామి

వైభవంగా పగల్‌పత్ తిరువీధి

సింహాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పగల్‌పత్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరువీధి వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో సుగంధభరిత పుష్పమాలికలతో శోభాయమానంగా తీర్చిదిద్ది బంగారు తొళక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత పలు రకాల వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ బేడామండంలో తిరువీధి జరిపారు. అనంతరం ఆలయ ఆస్థాన మండపంలో ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు చేసి నాలాయిర దివ్యప్రబంధం పారాయణలు చేశారు.

డైట్‌లో జాతీయ మహిళా దినోత్సవం

భీమునిపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డైట్ కళాశాలలో జాతీయ మహిళా దినోత్స వం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి, అధ్యా పకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మహిళా అధ్యాపకులు జె. మాధవి, ఎం. మహాలక్ష్మి, పి. హరిణి, నీలిమను ప్రిన్సిపాల్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్. సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, సోమయాజులు, ఎస్. త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

జిమ్‌సర్‌లో డీఎస్‌ఐ సమావేశాలు ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న పలు రంగాల్లోని నిపుణులు

ఎండాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్), డీవీఎల్, పాథాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో డెర్మటోపాథాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (డీఎస్ఐ) 27వ వార్షిక సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి ముఖ్య అతిథిగా హాజరై సమావేశాలను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు, అధ్యాపకులకు నూతన పరిజ్ఞానంపై అవగాహన కల్పించ డానికి సమావేశాల్లో నిపుణుల ప్రసంగాలు ఉపయోగపడతాయన్నారు. సమావేశాల నిర్వాహక చైర్‌పర్సన్ డాక్టర్ ఏ. శశికిరణ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే చర్చల వివరాలను తెలియజేశారు. అనంతరం డీఎస్ఐ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉమా నహర్ వార్షిక నివేదికను సమర్పించారు. సమావేశాలకు దేశంలో నలుమూలల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

'ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి'

పద్మనాభం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బి. సూర్యనారాయణ కోరారు. శుక్రవారం ఆయన పద్మనాభంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మధ్యంతర భృతి, కరువు భత్యం గురించి చర్చ వస్తుందని అంతా ఎదురుచూశామని, కానీ నిరాశే మిగిలిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా ఇంతవరకు 12వ వేతన సవరణ సంఘానికి కమిషనర్‌ను నియమించలేదని చెప్పారు.

ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే

జయంతి వేడుకల్లో వక్తలు

భీమునిపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని నెహ్రూరోడ్‌లో వున్న జీవీఎంసీ హైస్కూల్‌లో ఆదర్శ హిందీ ప్రేమి మండలి, పాఠశాల యాజమాన్యం



భీమిలిలో నివాళి అర్పిస్తున్న నూకరాజు, తదితరులు

సంయుక్తంగా వేడుకలు జరిపాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, తదితరులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

భీమునిపట్నం (రూరల్) : తాటితూరు ప్రాథమిక పాఠశాలలోనూ సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె. సన్యాసినాయుడు, విద్యా కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయు డు పోతురాజు పాల్గొన్నారు.

కొమ్మాది : దేశంలో తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఐద్వా మధురవాడ జోన్ కమిటీ అధ్యక్షురాలు కె. సుజాత అన్నారు. కొమ్మాది సీఐటీయూ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆమె మాట్లాడారు.

సాగర్‌నగర్ : రుషికొండలో ఉన్న గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా మిషన్ కార్యాలయంలోనూ వేడుకలు నిర్వహించారు. ఆ సంస్థ ఈడీ రాణిమంద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గీతంలో 'షోర్ ఫెస్ట్' ప్రారంభం



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

సాగర్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలోని బాలయోగి కళా ప్రాంగణంలో శుక్రవారం నుంచి తీర ప్రాంత యువజనోత్సవం ప్రారంభమైంది. జీవీఎంసీ అధికారి డీవీ రమణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై ఈ వేడుకలను ప్రారంభించారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఐఐటీ, ఎన్ఐటీల నుంచి పరిశోధకులు, యువ ఇంజనీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే వివిధ కళాశాలల్లో చదువు తున్న విదేశీ విద్యార్థులు కూడా తరలివచ్చారు. ఈ సందర్భంగా గీతం ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ కె. బాలాకుమార్, విద్యార్థి విభాగం డైరెక్టర్ రీమా చౌదరి, స్పోర్ట్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జిరాయితీ రైతులు ఆక్రమణదారులు కాదు

సింహాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామంలో జిరాయితీ భూములు కలిగి ఉన్న రైతులు ఆక్రమణదారులా కాదా అన్న విషయమై కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్‌ఓ చంద్రమ్మ శుక్రవారం విచారణ జరిపారు. గ్రామంలో జిరాయితీ భూములు కలిగి ఉన్న రైతులు ఆక్రమణదారులు కాదన్న విషయాన్ని గుర్తించాలని కోరుతూ వార్డులోని పలువురు ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు వీఆర్‌ఓ నేతృత్వంలో సచివాలయం అధికారులు విచారణ జరిపారు. తమ పూర్వీకుల నుంచి తమకు హక్కులు సంక్రమించాయని, తాము ఆక్రమణదారులు కాదని రైతులు విన్నవించారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ఆనందపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శొంఠ్యాం పంచాయతీలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన కొంత మంది చుట్టు పక్కల కాంట్రాక్టు పనులు ఒప్పుకుని అవసరమైన గ్రావెల్‌ను జేసీబీలు, లారీలు పెట్టి అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై కొందరు స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం రాత్రి దాడి చేసి, జేసీబీ, రెండు లారీలను సీజ్ చేసి, స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడితే ఉపేక్షించేది లేదన్నారు.

టీటీడీ ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

సాగర్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10న జరిగే వైకుంఠ ఏకాదశికి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు వేకువజామున 4 నుంచి రాత్రి 10 వరకు భక్తులకు సర్వదర్శనాలు కల్పిస్తామన్నారు. సాయంత్రం 4 నుంచి 6 వరకు మాత్రమే వీవీఐపీ, వీఐపీ, డోనర్స్ దర్శనాలు ఉంటాయన్నారు. సాయంత్రం 7 నుంచి 7.30 నిమిషాల వరకు బ్రేక్ ఉంటుందని చెప్పారు. రాత్రి 7.30 నుంచి 10 వరకు సర్వదర్శనాలు కొనసాగుతాయన్నారు. ఆరోజు సుమారు 50 వేల నుంచి 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలకు కొండపైకి అనుమతి లేదని, కార్లు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం మరో రెండు బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు.



శ్రీనివాసరావు ఇంటి ముందు ఆందోళన చేస్తున్న అత్త రమణమ్మ, భార్య భూలక్ష్మి, బంధువులు

నా కుమార్తె జీవితాన్ని సరిదిద్దండి

అల్లుడు ఇంటి ముందు అత్త ఆందోళన

భీమునిపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె కాపురాన్ని నిలబెట్టాలని కోరుతూ పట్టణంలోని నేరేళ్లవలస కాలనీలో ఉంటున్న అల్లుడు ఇంటి ముందు అత్త ఆందోళన చేపట్టింది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. నేరేళ్ళవలస కాలనీ యాతపేటకు చెందిన వై. శ్రీనివాసరావుకు, ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీలోని యాతపేటకు చెందిన బుత్తల భూలక్ష్మితో 2019లో వివాహం జరిగింది. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్త మధ్య మనస్పర్థలు రావడంతో మూడేళ్ల క్రితం శ్రీనివాసరావు, భూలక్ష్మిని పుట్టింటికి పంపించివేశాడు. అప్పటి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా.. భార్యను తీసుకు వెళ్లడం లేదు. దీంతో అతని అత్త రమణమ్మ శుక్రవారం తన కుమార్తె భూలక్ష్మి, మనవడుతో పాటు బంధువులతో అల్లుడు ఇంటి ముందు ఆందోళనకు దిగారు. తన కుమార్తె జీవితాన్ని బాగుచేసేవరకూ అక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో సంఘటనా స్థలానికి వెళ్లి, వారికి నచ్చజెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు.కాగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు రెండు రోజులు సమయం కావాలని కోరినట్టు పోలీసులు తెలిపారు.

సింహాచలం దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

సింహాచలం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న భక్తులను నమ్మించి సొమ్ము కాజేసిన దేవస్థానం ఉద్యోగి కింతాడ అప్పలరాజును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశాలు జారీ చేశారు. గత నెల 28న స్వామివారి దర్శనానికి హైదరాబాద్ నుంచి వచ్చిన దిలీప్‌కుమార్‌తో పాటు అతని కుటుంబ సభ్యులకు అతి శ్రీఘ్రదర్శనం, అంతరాలయ దర్శనం చేయిస్తానని నమ్మబలికి అప్పలరాజు రూ.1800 తీసుకుని మోసం చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు విచారణ జరిపారు. ఈమేరకు ఈఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు.

వైసీపీ చేతిలోనే ఫిల్మ్ క్లబ్!

... 5వ పేజీ తరువాయి

తప్పుకోవాలని హెచ్చరించారు. వైసీపీ పెద్దలు నచ్చినట్టు మార్చుకున్న బైలాను సవరించాలని ఆదేశించారు. అయితే ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఒక్కరే రాజీనామా చేసి తప్పుకున్నారు. కోశాధికారిగా వ్యవహరిస్తున్న గోపీనాథ్ రెడ్డి వైసీపీ అధికారం కోల్పోయిన తరువాత క్లబ్‌కు వెళ్లడం మానేశారు. మిగిలినవారు అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి అధ్యక్షతన 2024 ఆగస్టు 24 న సమావేశం నిర్వహించి అక్టోబరులో ఎన్నికలు నిర్వహించి తాము తప్పుకుంటామని ప్రకటించారు. మూడు నెలలైనా ఎన్నికలు నిర్వహించలేదు. వారు రాజీనామా చేయలేదు. క్లబ్‌కు ఆదాయం లేదు. రిజర్వ్‌లో ఉన్న సభ్యత్వ రుసుములను ఇష్టానుసారం ఖర్చు చేసేస్తున్నారు.

మరో వైపు గంటా తమకు వ్యతిరేకంగా ఉన్నారని, కార్యవర్గాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడి దగ్గరకు తీసుకువెళ్లి తమను కొనసాగించేలా చూడాలని, క్లబ్‌కు భూమి ఇప్పించాలని కమీషన్లు కొట్టేస్తున్న పెద్ద మనిషి కోరినట్టు తెలిసింది. ఇప్పుడు క్లబ్ వద్ద ఉన్న కోట్ల రూపాయల నిధులతో భూమి కొనేసి అందులో భారీగా కమీషన్ జేబులో వేసుకోవాలని కార్యవర్గంలో కొందరు యత్నిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇవన్నీ ఆర్థిక అక్రమాలే...

- క్లబ్‌లో కొత్తగా రెండు పోర్టికోలు నిర్మించారు. వీటికి రూ.1.5 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్క చూపించారు. వీటికి ఒకే డోర్ నంబరు కలిగిన మూడు సంస్థల నుంచి కొటేషన్లు స్వీకరించి ఏకపక్షంగా కాంట్రాక్టు ఇచ్చేశారు. వీటి నిర్మాణానికి అందులో సగం కూడా ఖర్చు కాదనేది వాస్తవం.
- నగరంలోని స్పైస్ ఎవెన్యూలో రూ.15 వేలు జీతానికి పనిచేసే ఉద్యోగిని తీసుకువచ్చి నెలకు రూ.45 వేలు ఇస్తున్నారు. అదనంగా ఇచ్చే జీతంలో 50 శాతం వ్యవహారాలు చక్కబెట్టే వ్యక్తికి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- క్లబ్‌లో ఏ ఈవెంట్ నిర్వహించినా వాటికి ఎక్కువ మొత్తంలో కొటేషన్ ఇచ్చి, అందులో 50 శాతం చక్రం తిప్పుతున్న వ్యక్తి జేబులో వేసుకుంటున్నట్టు చెబుతున్నారు.
- మూడు రోజుల క్రితం అంటే మంగళవారం రాత్రి నిర్వహించిన న్యూ ఇయర్ సెలబ్రేషన్లకు రూ.23 లక్షలు ఖర్చు చేశారు. దీనికి ఏజీఎం అనుమతి లేదు. ఈవెంట్ మేనేజర్‌కు రూ.10 లక్షలు క్లబ్ నుంచి ఇచ్చి, రూ.8 లక్షలు స్పాన్సర్ నుంచి తెచ్చారని, మిగిలిన మొత్తం టిక్కెట్ల విక్రయం ద్వారా వచ్చిందని అంటున్నారు. కానీ అవన్నీ అవాస్తవాలని కొందరు ఆరోపిస్తున్నారు. క్లబ్‌లో 400 మంది సభ్యులు ఉండగా అందులో కనీసం పదిహేను శాతం మంది ఆ రోజు ఈవెంట్‌కు రాలేదు. అధ్యక్షుడికి చెందిన సంస్థలో పనిచేస్తున్న వారిని రప్పించి జనాలు వచ్చినట్టు హడావుడి చేశారని విమర్శలు ఉన్నాయి. ఆ ఈవెంట్‌కు సమంత, శ్రీలీల, జబర్దస్త్ బృందం వస్తున్నారని ప్రచారం చేశారు. కోల్‌కతా డ్యాన్సర్లతో గెంతులు వేయించి మమ అనిపించారు. దీనికి రూ.23 లక్షలు వెచ్చించారు.
- క్లబ్‌లో నాలుగు రూములు ఉన్నాయి. వాటికి ఒక్కో దానికి రూ.2 వేలు అద్దె. రోజుకు రూ.8 వేలు. నెలలో 20 రోజులు అన్నీ బుక్ అయ్యాయని అనుకుంటే వచ్చే ఆదాయం రూ.1.6 లక్షలు. కానీ ఆ రూముల నిర్వహణకు నెలకు రూ.2 లక్షలు ఖర్చు చేస్తున్నారు. సబ్బులు, క్లీనింగ్ అని ఆదాయం కంటే ఎక్కువ చూపిస్తున్నారు. వాటిని సరఫరా చేసే సంస్థ నుంచి కూడా కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ప్రధాని సభకు విస్తృత ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి జిల్లా నుంచి 40 వేల మందిని సమీకరించేందుకు నిర్ణయించామన్నారు. సభకు వచ్చే వారికి రవాణా, భోజన సదుపాయం కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. నగర సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ 22 ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని విశాఖ కలెక్టర్, నగర సీపీలను ఆదేశించారు. ప్రధాని ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన సంపత్ వినాయక్ ఆలయం వద్దకు చేరుకుని అక్కడ నుంచి ఓపెన్‌టాప్ వాహనంపై బహిరంగ సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకూ రోడ్‌షో నిర్వహిస్తారన్నారు. సంపత్ వినాయక్ ఆలయం నుంచి సభా ప్రాంగణం వరకూ విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. సభకు అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే వారికి భోజన వసతి కల్పించాలని, వచ్చేవారంతా సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు నేవీ విన్యాసాలు

... 5వ పేజీ తరువాయి

విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళతారు.

సీఎం, డిప్యూటీ సీఎం కుటుంబ సభ్యులతో రాక

నేవీ ఆపరేషన్ డెమోకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆయన సతీమణి, పిల్లలు రానున్నారు. ఇంకా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శుక్రవారం రాత్రే నగరానికి చేరుకున్నారు.

మహా గోప్యం!

... 5వ పేజీ తరువాయి

అధికారులు చెల్లింపులు జరుపుతుంటారు.

జీవీఎంసీలో ఇష్టారాజ్యం

జీవీఎంసీలో ప్రస్తుతం బిల్లుల చెల్లింపు పరిశీలిస్తే ఫిబ్రవరిలో ఓచర్ రైజ్ అయిన పనులకు బిల్లులు చెల్లించేశారు. ఆ తర్వాత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలోని కొందరు పెద్దలు జీవీఎంసీ బిల్లుల చెల్లింపులో కీలకంగా వ్యవహరించే అధికారులను ప్రసన్నం చేసుకుని, అక్టోబరులో ఓచర్ రైజ్ అయిన పనులకు అడ్డదారిలో పేమెంట్లు తీసుకున్నారు. మరికొంతమంది ప్రజా ప్రతినిధులతో సిఫారసు చేయించుకుని బిల్లులు చేసుకున్నారు. దీనివల్ల పది నెలల కిందట పని పూర్తిచేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ అధికారులతోపాటు కాంట్రాక్టర్లలో కలకలం రేగింది.

చక్రం తిప్పిన అధికారులు

అడ్డదారిలో బిల్లులు చేసిన వైనం పూర్తి ఆధారాలతో వెలుగుచూసిన నేపథ్యంలో దానికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు, అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకున్నారు. బిల్లుల చెల్లింపు, ఏ బిల్లు చెల్లింపు ప్రక్రియ ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందనే వివరాలు ఇంజనీరింగ్ అధికారులతోపాటు డ్రాయింగ్ బ్రాంచిలోని అధికారులు, సిబ్బందికి కూడా తెలియకుండా పోర్టల్‌లో మార్పులు చేశారు. బిల్లుల వివరాలు కేవలం అదనపు కమిషనర్ (ఫైనాన్స్), అకౌంట్స్, ఐటీ విభాగాల సిబ్బంది మాత్రమే చూసేలా యాక్సిస్‌లో ఉంచారు. మిగిలిన ఇంజనీర్లు, డ్రాయింగ్ బ్రాంచిలకు ఆ అవకాశం లేకుండా చేశారు. దీనివల్ల బిల్లుల చెల్లింపులో ఎన్ని అక్రమాలు జరిగినా బయటకు తెలిసే అవకాశం లేకుండాపోయింది.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ విజయభాస్కర్, పాల్గొన్న సంఘ నేతలు

ఆరిలోవ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పాఠశాలల విద్యా సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయ్‌భాస్కర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శైలజాకుమారి, కోశాధికారి కృష్ణ చైతన్య, అసిస్టెంట్ డైరెక్టర్ నరసింగరావు, కె. ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ఫాల్ దరఖాస్తుదారులు సకాలంలో క్లియర్ చేసుకోవాలి

» వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అనధికార లే అవుట్స్ స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) 2020కు లోబడి పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్స్ క్లియరెన్స్ చేసుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. దీని గడువును మార్చి 31తేదీ వరకూ పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మెమోకు అనుగుణంగా చెల్లింపులు, దస్త్రాల సమర్పణకు ఇచ్చిన షార్ట్‌ఫాల్స్ వివిధ దశలలో పెండింగ్ ఫైల్స్ గుర్తించి తదుపరి చర్యలను తీసుకొని నిర్దిష్ట కాల పరిమితిలోగా క్లియర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే ఎల్‌ఆర్‌ఎస్ పథకం ద్వారావీఎంఆర్డీఏకు 5803 దరఖాస్తులు రాగా, అందులో 2942 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేసినట్టు తెలిపారు. 615 దరఖాస్తులు తిరస్కరించగా, 127 దరఖాస్తుదారులకు చెల్లింపులు నోటీసులు జారీ చేయగా, 2111 దరఖాస్తుదారులకు షార్ట్‌ఫాల్స్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. షార్ట్‌ఫాల్ అందుకున్న దరఖాస్తుదారులు సంబంధిత దస్త్రాలను వీఎంఆర్డీఏకు సాధ్యమైనంత త్వరగా సమర్పించి దరఖాస్తులను క్లియర్ చేయడంలో సహకరించాలని కోరారు.

వార్డు సచివాలయ కార్యదర్శికి అభినందనలు

వెంకోజీపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్‌లోని జైసల్మేర్ నగరంలో నిర్వహించిన 'ది హెల్ రేస్ రన్'లో పాల్గొన్న జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట సచివాలయంకార్యదర్శి మొండి మహేష్‌ను జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ శుక్రవారం ఆయన ఛాంబర్‌లో అభినందించారు. 2024 డిసెంబరు 14, 15 తేదీల్లో జైసల్మేర్ నుంచి లాంగేవాలా వరకు (ఇండో-పాక్ బోర్డర్) 160 కిలోమీటర్లు ది హెల్ రేస్‌ను 25 గంటలలో చేశారని, అతి పెద్ద రన్‌లో పాల్గొని విశాఖ నగరానికి మంచి గుర్తింపు తెచ్చారని ఆయనను కమిషనర్ అభినందించారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 44 దొండకాయలు 44, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

దుర్గంధంలోనే చదువులు

» పాఠశాల పక్కనే పశువుల పెంపకం
» ఇబ్బందులకు గురవుతున్న చిన్నారులు
» సమస్య పరిష్కారంపై దృష్టి సారించని అధికారులు

ఆరిలోవ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానికులు కొందరు స్కూలుకు సమీపంలోనే పశువులు పెంచుతుండడంతో పరిసరాలు దుర్గంధంగా తయారవుతున్నాయి. దీంతో చదువుకునేందుకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చినగదిలిలోని సంతపాలెం స్కూలు పక్కనే స్థానికులు కొందరు గేదెలను పెంచుతున్నారు. ఆ గేదెలు రోజూ పేడ, మూత్రం వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగాతయారవుతున్నాయి. అంతేకాకుండా తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. పక్కనే ఉన్న స్కూలులోకి ఆ దుర్గంధం వెదజల్లడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఒకవైపు చిన్నారులు ఉండే పాఠశాల, మరోవైపు ఇది జన సంచార ప్రాంతం కావడంతో పరిసరాలు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. వర్షం వచ్చినప్పుడు పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. అంతా చిత్తడిగా మారిపోతుంది. గేదెల పెంపకం ప్రైవేటు స్థలం అయినప్పటికీ పాఠశాలకు ఇబ్బందిగా ఉండడంతో అధికారులు కిమ్మనకపోవడం బాలేదని స్థానికులు, తల్లిదండ్రులు అంటున్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పే అధికారులు ఇలాంటి విషయాల్లో మాత్రం స్పందించకపోవడం అన్యాయమని అంటున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీసం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



దారుణంగా ఉన్న స్కూలు పక్కన పరిసరాలు

ప్రధాని, సీఎం పర్యటనల ఏర్పాట్లు పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నేవీ డే సందర్భంగా శనివారం చంద్రబాబు, వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఈ నెల 8న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నగరానికి విచ్చేయనున్న నేపథ్యంలో ఆయా కార్యక్రమాల ఏర్పాట్లను శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నేవీ డే విన్యాసాలు తిలకించేందుకు సీఎంతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు విశాఖ నగరానికి వస్తున్నారని తెలిపారు. అలాగే అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్నందున బీచ్ రోడ్డులో పారిశుధ్యం, విద్యుత్, రోడ్ల మరమ్మతులు, తాగునీరు సుందరీకరణ, పార్కింగ్ తదితర పనులను పరిశీలించినట్టు చెప్పారు. బీచ్ రోడ్డులో పూటకు 30 మంది పారిశుధ్య కార్మికులను అదనంగా ఏర్పాటు చేశామని, అలాగే 60 బయో టాయిలెట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు జనవరి 8న విశాఖలో ఏయూ గ్రౌండ్‌కు వస్తున్నందున అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఏయూ గ్రౌండ్‌లో జరిగే ప్రధానమంత్రి సభకు దాదాపు లక్ష మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నట్టు చెప్పారు.అక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లు సమకూర్చుతున్నామన్నారు. చెట్లు, మొక్కలను ఆకర్షణీయంగా ట్రిమ్మింగ్ చేయాలని డీడీహెచ్ దామోదరరావును ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

పార్కు నుంచి పశువుల తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆవులను తరలిస్తున్న జీవీఎంసీ, స్టీల్‌ప్లాంటు సిబ్బంది

వెంకోజీపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డుల్లో స్టీల్ ప్లాంటు స్థలాలు పశువుల సంతలా మారాయంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వచ్చిన కథనానికి స్టీల్‌ప్లాంటు అధికారులు, జీవీఎంసీ పశు సంవర్ధక విభాగం అధికారులు స్పందించారు. ఇక్కడి ఖాళీ స్థలాల్లో విచ్చలవిడిగా పెంచుతున్న ఆవులను జీవీఎంసీ వ్యానులో శుక్రవారం తరలించారు. జీవీఎంసీ వెటర్నరీ సిబ్బంది రమణ, స్టీల్‌ప్లాంట్ సిబ్బంది పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడ్డీల మాటేంటి?

స్టీల్‌ప్లాంట్ స్థలాలలో ఉన్న ఆవులను తరలించినప్పటికీ ఈ స్థలాలకు ఆనుకుని రోడ్లను ఆక్రమించి ఏర్పాటుపదుల సంఖ్యలో ఏర్పాటు చేసిన బడ్డీలను మాత్రం తొలగించారా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బడ్డీలను తొలగిస్తే ఇక్కడ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు. ఈ విషయంలో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 9 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు సంబంధించి 9 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చీఫ్ సిటీ ప్లానరు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

గురుకులానికి రెండు బహుమతులు

ఆరిలోవ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తోటగరువు జిల్లా పరిషత్తు హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో తమ పాఠశాలకు రెండు కేటగిరిల్లో బహుమతులు దక్కడం ఆనందంగా ఉందని శ్రీకృష్ణాపురం సాంఘిక గురుకులం విద్యాసంస్థ ప్రిన్సిపాల్ రత్నవల్లి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె టీచర్లను అభినందించారు.

మహిళలకు సావిత్రిబాయి పూలే ఆదర్శం

» జయంతి కార్యక్రమంలో కొనియాడిన వక్తలు » ఘనంగా నివాళి



మద్దిలపాలెం : కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పి.జయ మాట్లాడుతూ స్త్రీ విద్యపై మొట్టమొదట గళమెత్తిన ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అన్నారు. దేశ తొలి ఉపాధ్యాయురాలిగా మహిళల విద్య కోసం ఎంతగానో శ్రమించిన వీరనారి అని కొనియాడారు. విద్యార్థినులు సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకొని విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.శ్రావణ్‌కుమార్, పి.ఉమామహేశ్వరరావు, ఆర్.కుసుమకుమారి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూలో..

వెంకోజీపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో సావిత్రి బాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏయూ సెనేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపకులపతి జి.శశిభూషణరావు ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం కృషి చేసిన ఆదర్శణీయురాలు అన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ వుమెన్‌స్టడీస్ డైరెక్టర్ ఎ.పల్లవి,పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏయూలో నివాళి అర్పిస్తున్న వీసీ, ఆచార్యులు

రామ్‌నగర్‌లో రూ.27 లక్షలతో అభివృద్ధి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పాల్గొన్న కార్పొరేటర్ అప్పలకొండ, కూటమి నేతలు

రామ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 28వ వార్డులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్‌నగర్ బజార్ బజార్ డౌన్ వద్ద రూ.27 లక్షలతో దోబీఘాట్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, సామాజిక భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. ఆయా పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి ఊపందుకుందన్నారు. గత వైసీపీ హయాంలో నగరంలో ఎలాంటి అభివృద్ధి చేట్టలేదని విమర్శించారు. సంక్షేమ పథకాలు అందించడంలో కూడా తమ ప్రభుత్వం ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు, నేతలు నక్కా అన్నపూర్ణ, పల్లా దుర్గారావు, ఆళ్ల శ్రీనివాసరావు, జీవీఎంసీ అధికారులు వేంకటేశ్వరరావు, ఆనంద్, రామ్‌నగర్, భానోజీనగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాలకు చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి : సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్

సిరిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన వలంటీర్ వ్యవస్థ కొనసాగింపు హామీని నెరవేర్చాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర వ్యాప్త పిలుపులోభాగంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు రూ.పది వేలు జీతాలు ఇచ్చి వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చంద్రబాబు చెప్పారని పేర్కొన్నారు. కానీ ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఈ విషయమే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారిధిగా పని చేసే వలంటీర్లను తొలగించడం అన్యామన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, వలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి దీప్తి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాడుతామన్నారు. మహిళలపై ఏమాత్రం గౌరవం ఉన్నా వలంటీర్లు అందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, పార్వతి, లక్ష్మణ్, ఆదిలక్ష్మి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల రిటైర్‌మెంట్ వయసు పెంచాలి

జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్

సిరిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలోని రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల రిటైర్డ్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దర్నా నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ప్ల కార్డులు చేత పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న డెత్, రిటైర్డ్, అనారోగ్య, దీర్ఘకాలిక అనారోగ్య కార్మికుల వారసులకు ఉద్యోగాలు వెంటనే కల్పించాలన్నారు. నగర జనాభా ప్రకారం సిబ్బందిని పెంచాలన్నారు. ఇతర శాఖలు, విభాగాలకు పంపించిన కార్మికులను వెనక్కి రప్పించాలని కోరారు. పారిశుధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలలో పని చేస్తున్న కార్మికులు ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారని, వీరిని అన్ని రకాల దోపిడీ, వివక్ష నుంచి రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ముందుస్తు నోటీసు ఇవ్వకుండా నోటి మాటతో అర్ధాంతరంగా జీవీఎంసీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు.



నినాదాలు చేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు

నిరుద్యోగులను మోసగించిన వైసీపీ : వీఎంఆర్డీఏ చైర్మన్

సిరిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులను మోసం చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి నట్టేటముంచిందన్నారు.ఇప్పుడు నిరుద్యోగులపై ప్రేమ ఉన్నట్టు వైసీపీ నాయకులు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2.4 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, మెగా డీఎస్సీ అని చెప్పి నిరుద్యోగులను మోసం చేసింది ఎవరని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు మంచి అవకాశాలు లభిస్తాయన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది సేవలు రెండేళ్లు కొనసాగించాలి

వెంకోజీపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగంలో పని చేస్తున్న 200 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను మరో రెండు సంవత్సరాల పాటు కొనసాగించాలని కోరుతూ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌లకు వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల సత్య సూర్యశ్రీనివాసరావు కోరారు.ఈ మేరకు ఆయన శుక్రవారం మేయర్, కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్మికులు ఇటీవల 60 ఏళ్లు పూర్తి చేయడం వలన వారి సేవలను నిలిపివేశారని పేర్కొన్నారు. వీరు కరోనా సమయంలో చేసిన సేవలు, అంకితభావం గుర్తుంచుకోవాలన్నారు. తక్కువ జీతాలకే ప్రాణాలను పణంగా పెట్టిన వీరి సేవలను గుర్తించాలని కోరారు.

మానవతా దృక్పథంతో వీరిని మరో రెండేళ్లు కొనసాగించాలని విన్నవించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విస్తృతంగా ట్రాఫిక్ తనిఖీలు

మద్దిలపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ నేతృత్వంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మద్దిలపాలెం కూడలిలో హెల్మెట్ ధరించనివారితో పాటు నిబంధనలు పాటించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ట్రిబుల్ రైడింగ్ బైకర్లను నిలిపి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ మాట్లాడుతూ 2025లో రోడ్డు ప్రమాదాలు నివారణే ధ్యేయంగా చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మరణాలు సంభవిస్తున్నాయని, అందుకే హెల్మెట్ ధారణ కచ్చితంగా పాటించేలా విస్తృత తనిఖీలు చేపడతామన్నారు. బైక్‌పై ఇద్దరు ప్రయాణిస్తే వారిద్దరు హెల్మెట్లు ధరించాలన్నారు. లేదంటే వారికి జరిమానాలు వేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రయాణికుల సంరక్షణ కోసమేనన్నారు. తనిఖీలు చేపట్టేది కూడా ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండడానికేనని, అర్థం చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు నిబంధనలు పాటించి ప్రజలు సహకరించాలనికోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ధనుర్మాస పూజలు


పూజా కార్యక్రమాలు చేపడుతున్న అర్చకులు

మురళీనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీలోని శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతల సమక్షంలో ఉదయం పొన్న హారతి, పూజాదికాల్ని అర్చకుడు శేషస్వామి నిర్వహించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తుల నడుమ తిరుప్పావై పాశుర విన్నపం సమర్పించారు. అనంతరం అమ్మవారు, రంగనాథులను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్, వేద పండితులు, సిబ్బంది హాజరయ్యారు.

మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం


మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మహారాణిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు విశాఖ జిల్లా దక్షిణ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కస్తూరి వెంకటరావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కాలంలో సంస్కరణలు అమలు చేసి ఆదుకున్నారని శ్లాఘించారు. ప్రధానిగా దేశానికి అమూల్య సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు హర్షద్ బాషా, శివకుమార్, సతీష్, చిన్నా అప్పారావు, సత్యనారాయణ, వెంకటేష్, ఈశ్వరరావు, త్రినాథరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి సమస్యకు తెర


కొళాయిల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కృష్ణాగార్డెన్స్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజు వెంటనే స్పందించి జీవీఎంసీ అధికారులతో మాట్లాడి కొత్త కొళాయిలు ఏర్పాటు చేసి శుక్రవారం వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. తమ ఇబ్బందులు తీర్చిన కార్పొరేటర్‌ను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ విల్సన్, మోహన్, జీవన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కామేశ్వరి, శ్యామలాదీపిక

కంచరపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు పరిధి జగ్జీవన్ నగర్‌లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలోని ప్రధాన గెడ్డ రక్షణ గోడ నిర్మాణానికి రూ.19 లక్షలు కేటాయించడంతో పనులను ప్రారంభించినట్టు శ్యామలా తెలియజేశారు. కొండవాలు గ్రామాల్లో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురువోజీ, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సొంతూరుకు చేరిన ఆరాధన


కుటుంబ సభ్యులతో ఆరాధన

అక్కయ్యపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న ఆరాధనను సొంతూరు శ్రీకాకుళం జిల్లాలోని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి వాసు తెలిపారు. ఆమె ఖైనీ, గుట్కాలకు బాగా అలవాటు పడి నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న రోడ్డుపై దిక్కు తోచని స్థితిలో ఉండన్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం తో ఆమెను వసతి గృహానికి తరలించినట్టు చెప్పారు. తల్లిదండ్రులు మృతిచెందడంతో ఆమె 20 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోందని, ఆరేళ్ల విశాఖ ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో చికిత్స చేయించారన్నారు. భర్త వదిలేసి వెళ్లిపోయాడని, సోదరుడు మద్యానికి బానిస అయ్యాడని, ఆమె గ్రామంలో ఒంటరిగా తిరుగుతూ ఉంటే ఓ చర్చ్ ఫాదర్ చేరదీసి వైజాగ్‌లో ఉంటున్న సోదరి దగ్గరకు పంపించారన్నారు.

చిందరవందరగా 'సుందరీకరణ'

» కానరాని హైవే గ్రీనరీ నిర్వహణ » కళ్లు మూసుకున్న జీవీఎంసీ అధికారులు

మాధవధార, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర సుందరీకరణ పేరిట జీవీఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఫలితాలు కానరావడం లేదు. రోజు రోజుకూ పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం కనిపించాల్సింది పోయి, నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. నగర పరిధిలో జాతీయ రహదారి (హైవే) నిర్వహణ బాధ్యత ఇప్పుడు మహా విశాఖ నగర పాలకసంస్థ చేతుల్లో ఉంది. రహదారి మధ్యన, సర్వీసు రోడ్డు ఇరువైపులా పచ్చదనం పెంపు, నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. ప్రవేశ ద్వారం (గేట్ వే) మాదిరిగా ఉండే ఎన్ఏడీ జంక్షన్ దగ్గర నుంచి నగరంలోకి ప్రవేశించే ఆర్‌అండ్‌బీ జంక్షన్, తర్వాత సిగ్నల్ బిర్లా జంక్షన్, కంచరపాలెం, గురుద్వార.. ఇలా.. ముఖ్యమైన కూడళ్ల వద్ద పచ్చదనం (గ్రీనరీ) పలుచోట్ల మచ్చుకైనా కనిపించడం లేదు.


విరిగిపోయిన ఇనుప రక్షణ కంచె

బిర్లా జంక్షన్ పెట్రోల్ బంక్ వద్ద, ఆర్‌అండ్‌బీ దాటాక రిలయన్స్ పెట్రోల్ బంక్‌ల వద్ద భారీ వాహనాల రాకపోకల్లో హైవే గ్రీనరీకి రక్షణగా వేసిన ఇనుప కంచెలను ఢీకొట్టి పోతున్నాయి. వాహన ప్రమాదాలు, హైవేల్లో జోరుగా వచ్చే వాహనాలతో జాతీయ రహదారి నడిమధ్య ప్రధాన మొక్కలు, డివైడర్లు దెబ్బతింటున్నాయి. మళ్లీ మళ్లీ ఇదే తంతు నడుస్తోంది. కనీసం ఈ పెట్రోల్ బంక్ నిర్వాహకులకు గానీ, హైవే సర్వీస్ రోడ్లను ఆనుకొని బిర్లా జంక్షన్, ఊర్వశి, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో ఉండే వ్యాపారులు, వాహన షోరూంల నిర్వాహకులకు గానీ వీటిపై కనీస జాగ్రత్తలు తీసుకునే అవగాహన కల్పించడం లేదు. పోతే ప్రజాధనమే కదా! అన్నట్టు జీవీఎంసీ సిబ్బంది వ్యవహరిస్తుండటంతో నిర్వహణ గాడి తప్పుతోంది. హైవేరోడ్డును ఆనుకొని ఉన్న చోట్ల దుకాణాల నిర్వాహకులు తమకు నచ్చినట్టుగా మొక్కల్ని, ఇనుప కంచెను తొలగిస్తున్నా వీరిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. జీవీఎంసీ బాధ్యులు ప్రస్తుత ఉదాసీనతను విడనాడి నగర సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ఈ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.


ఆర్టీఏ కార్యాలయం ఎదుట రోడ్డులో ధ్వంసమైన మొక్కలు

'భూముల సమస్య పరిష్కరిస్తా'


రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని 22ఏ భూముల సమస్య పరిష్కరిస్తానని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. గ్రేటర్ 14, 25 వార్డులకు సంబంధించి స్థానిక సింధూర కల్యాణ మండపంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 22ఏ భూములకు సంబంధించిన పలు సమస్యలు, ఇళ్ల పట్టాల విషయమై ప్రజలు అక్కడికి వచ్చి వినతులు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ సీతమ్మధార, సీతంపేట ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్న 22ఏ భూముల సమస్య విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ప్రత్యేక జీవో తీసుకొని వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పసుపులేటి ఉషాకిరణ్, మహ్మద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్ముకశ్మీర్ జట్టుపై ఛత్తీస్‌గఢ్ విజయం

విజయ్ హజారే టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో భాగంగా శుక్రవారం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ ఏడు వికెట్ల తేడాతో జమ్ము కశ్మీర్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జమ్ము కశ్మీర్ 47.3 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ శుభం ఖజూరియా సెంచరీ (159) సాధించగా, వివరంత్ శర్మ (42), ముజాఫర్ (32), అబిద్ ముస్తక్ (30) రాణించారు. ఛత్తీస్‌గఢ్ బౌలర్లలో రవికిరణ్ మూడు వికెట్లు పడగొట్టగా, హర్ష యాదవ్, గగన్‌దీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఛత్తీస్‌గఢ్ 48.3 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 339 పరుగులు చేసి విజయం సాధించింది. అశుతోష్ సింగ్ (127), సంజీత్ దేశాయ్ (128) సెంచరీలతో చెలరేగగా పీఎం యాదవ్ హాఫ్ సెంచరీ (51 నాటౌట్), అమన్‌దీప్ (21 నాటౌట్) రాణించి జట్టుకు సునాయాస విజయాన్నందించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

అల్లిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని కొబ్బరితోట గ్రౌండ్‌లో కేబీటీ విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంటును స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు ఉల్లాసంగా క్రికెట్ ఆడారు. శరీర సౌష్టవానికి, ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఈ నెల 5 వరకు జరిగే టోర్నమెంట్‌లో 9 జట్లు పోటీపడతాయని నిర్వాహకులు తెలిపారు. కూటమి నాయకులు, ఆర్గనైజర్ మనోహర్ పాల్గొన్నారు.


సరదాగా బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


టేబుల్ టెన్నిస్ ఆటలో పాల్గొన్న బాలికలు

పాలిటెక్నిక్ కళాశాలలో..

కంచరపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రీజనల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా శుక్రవారం వివిధ కళాశాలల జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, రన్నింగ్, టేబుల్ టెన్నిస్ తదితర ఆటల్లో పోటీలు జరిగాయి. శనివారం ఈ పోటీలు ముగుస్తాయి. ముగింపు కార్యక్రమం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలిపారు.

వైద్య ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

సీతమ్మధార, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. రీజనల్ డైరెక్టర్ రాధారాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రీజనల్ డైరెక్టర్ రాధారాణి, జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు తదితరులు

రాష్ట్ర ఉద్యోగినుల విభాగం అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు నగేష్ పట్నాయక్, కార్యదర్శి రత్నం, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరావు, కార్యదర్శి రామునాయుడు, తెలుగునాడు జోనల్ కార్యదర్శి సత్యానంద్, చలం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాన్వెంట్ కూడలిలో నత్తనడకన పనులు

జ్ఞానాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే కాన్వెంటు కూడలి వద్ద నెలరోజులుగా వాహనదారులు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. చావులమదుం వంతెనకు ఓ వైపు మార్గంలో చేపట్టిన రోడ్డు మరమ్మతులు నత్తనడకన సాగుతుండడమే ఇందుకు కారణం. కాన్వెంటు కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గం ఒక్కటే కావడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. అయినా ఇంజనీరింగ్ అధికారులకు పట్టడం లేదు. గుత్తేదారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ పని త్వరగా పూర్తయ్యేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

పీడిత వర్గాలకు అండగా పూలే దంపతులు


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలిలో ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి



జిల్లా టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ నాయకులు

డాబాగార్డెన్స్/మహారాణిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అణగారిన పీడిత వర్గాల మహిళల కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల త్యాగాన్ని ఎప్పటికీ మరవలేమని శాసనమండలిలో ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సావిత్రీబాయి మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ విధానాలపై ప్రజల్లో చైతన్యం కలిగించి కృషి చేశారని తెలిపారు. 1897లో పుణె నగరంలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు ఆ రోగులకు సేవ చేస్తూ, చివరికి ఆ వ్యాధితో తనువు చాలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో బీసీ సెల్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు తదితరులు సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేశారు. దేశంలో మొదటి ఉపాధ్యాయినిగా ఆమె స్త్రీ విద్య అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. అనసూరి మధు, టి.విజయకుమార్, జి.ఆనంద్‌బాబు, రాజమండ్రి నారాయణ పాల్గొన్నారు.

లేపాక్షి సర్కిల్‌కు సరికొత్త ఆకర్షణ



జగదాంబ కూడలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం ఆరంభం నుంచి లేపాక్షి సర్కిల్ సరికొత్త ఆకర్షణతో జిగేల్‌మంటోంది. లేపాక్షి నుంచి జగదాంబకు వెళ్లే మార్గంలో వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసి, పైన నంది విగ్రహాన్ని రూపొందించి విద్యుత్ సొబగులద్దారు. సంక్రాంతి పండుగ కొనుగోళ్ల కోసం భారీగా తరలి వస్తున్న ప్రజల దృష్టి ఈ కూడలిపై నిలిచింది. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు నాలుగైదు నెలలు ఈ పనులు చేపట్టారు. నగరంలోని ప్రధాన కూడళ్లను తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా లేపాక్షి సర్కిల్ వద్ద దాదాపు రూ.1.5 లక్షలతో దీన్ని తీర్చిదిద్దారు.

క్రాస్ కంట్రీ టోర్నీకి విశాఖ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే విశాఖ జట్టు సభ్యులను శుక్రవారం ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలంలో జరిగే ఈ టోర్నీలో విశాఖ నుంచి పురుషులు, మహిళల విభాగాల్లో 32 మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించనున్నారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ఎం.నారాయణరావు తెలిపారు. పురుషుల విభాగంలో ఎంఎస్.వేదవ్యాస్, వి.రమేష్, ఒ.విశాల్ అభిషేక్, పంగి శామ్యూల్, జె.వి.లలిత్ రోషన్, డి.రవి, ఎం.చిన్న, ఎం.సాయి యశ్వంత్, ఎ.రాజవర్ధన్, డి.రాహుల్ సాయికుమార్, జనం బాలచందర్, వి.కిరణ్‌కుమార్, బి.జగదీష్, ఎస్.సాయి విగ్నేష్, ఎం.జీవన్‌కుమార్, యు.జెశ్వన్ ఎంపికయ్యారు. మహిళల విభాగంలో కె.దివ్యదుర్గ, వేగి జ్యోతి దుర్గస్వరూప, కె.హేమాగ్ని, ఫర్జానా అస్మి మహ్మద్, కె.ధనలక్ష్మి, ఎల్.మేరీ గ్రేస్, బోర హారిక, పి.హాసిని, పి.వైశాలి, జి.రోహిణి, సిహెచ్.పుష్ప, ఎస్.నిహారిక, కె.రాగిణి, వి.కావ్య మూర్తి, బి.ప్రవల్లికరెడ్డి, బి.భార్గవి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ జట్టుకు మేనేజర్‌గా కె.నీలకంఠ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

వైసీపీ చేతిలోనే ఫిల్మ్ క్లబ్!

... 5వ పేజీ తరువాయి

తప్పుకోవాలని హెచ్చరించారు. వైసీపీ పెద్దలు నచ్చినట్టు మార్చుకున్న బైలాను సవరించాలని ఆదేశించారు. అయితే ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఒక్కరే రాజీనామా చేసి తప్పుకున్నారు. కోశాధికారిగా వ్యవహరిస్తున్న గోపీనాథ్ రెడ్డి వైసీపీ అధికారం కోల్పోయిన తరువాత క్లబ్‌కు వెళ్లడం మానేశారు. మిగిలినవారు అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి అధ్యక్షతన 2024 ఆగస్టు 24 న సమావేశం నిర్వహించి అక్టోబరులో ఎన్నికలు నిర్వహించి తాము తప్పుకుంటామని ప్రకటించారు. మూడు నెలలైనా ఎన్నికలు నిర్వహించలేదు. వారు రాజీనామా చేయలేదు. క్లబ్‌కు ఆదాయం లేదు. రిజర్వ్‌లో ఉన్న సభ్యత్వ రుసుములను ఇష్టానుసారం ఖర్చు చేసేస్తున్నారు. మరో వైపు గంటా తమకు వ్యతిరేకంగా ఉన్నారని, కార్యవర్గాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడి దగ్గరకు తీసుకువెళ్లి తమను కొనసాగించేలా చూడాలని, క్లబ్‌కు భూమి ఇప్పించాలని కమీషన్లు కొట్టేస్తున్న పెద్ద మనిషి కోరినట్టు తెలిసింది. ఇప్పుడు క్లబ్ వద్ద ఉన్న కోట్ల రూపాయల నిధులతో భూమి కొనేసి అందులో భారీగా కమీషన్ జేబులో వేసుకోవాలని కార్యవర్గంలో కొందరు యత్నిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇవన్నీ ఆర్థిక అక్రమాలే...

- క్లబ్‌లో కొత్తగా రెండు పోర్టికోలు నిర్మించారు. వీటికి రూ.1.5 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్క చూపించారు. వీటికి ఒకే డోర్ నంబరు కలిగిన మూడు సంస్థల నుంచి కొటేషన్లు స్వీకరించి ఏకపక్షంగా కాంట్రాక్టు ఇచ్చేశారు. వీటి నిర్మాణానికి అందులో సగం కూడా ఖర్చు కాదనేది వాస్తవం.
- నగరంలోని స్పైస్ ఎవెన్యూలో రూ.15 వేలు జీతానికి పనిచేసే ఉద్యోగిని తీసుకువచ్చి నెలకు రూ.45 వేలు ఇస్తున్నారు. అదనంగా ఇచ్చే జీతంలో 50 శాతం వ్యవహారాలు చక్కబెట్టే వ్యక్తికి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- క్లబ్‌లో ఏ ఈవెంట్ నిర్వహించినా వాటికి ఎక్కువ మొత్తంలో కొటేషన్ ఇచ్చి, అందులో 50 శాతం చక్రం తిప్పుతున్న వ్యక్తి జేబులో వేసుకుంటున్నట్టు చెబుతున్నారు.
- మూడు రోజుల క్రితం అంటే మంగళవారం రాత్రి నిర్వహించిన న్యూ ఇయర్ సెలబ్రేషన్లకు రూ.23 లక్షలు ఖర్చు చేశారు. దీనికి ఏజీఎం అనుమతి లేదు. ఈవెంట్ మేనేజర్‌కు రూ.10 లక్షలు క్లబ్ నుంచి ఇచ్చి, రూ.8 లక్షలు స్పాన్సర్ నుంచి తెచ్చారని, మిగిలిన మొత్తం టిక్కెట్ల విక్రయం ద్వారా వచ్చిందని అంటున్నారు. కానీ అవన్నీ అవాస్తవాలని కొందరు ఆరోపిస్తున్నారు. క్లబ్‌లో 400 మంది సభ్యులు ఉండగా అందులో కనీసం 15 శాతం మంది ఆ రోజు ఈవెంట్‌కు రాలేదు. అధ్యక్షుడికి చెందిన సంస్థలో పనిచేస్తున్న వారిని రప్పించి జనాలు వచ్చినట్టు హడావుడి చేశారని విమర్శలు ఉన్నాయి. ఆ ఈవెంట్‌కు సమంత, శ్రీలీల, జబర్దస్త్ బృందం వస్తున్నారని ప్రచారం చేశారు. కోల్‌కతా డ్యాన్సర్లతో గెంతులు వేయించి మమ అనిపించారు. దీనికి రూ.23 లక్షలు వెచ్చించారు.
- క్లబ్‌లో నాలుగు రూములు ఉన్నాయి. వాటికి ఒక్కో దానికి రూ.2 వేలు అద్దె. రోజుకు రూ.8 వేలు. నెలలో 20 రోజులు అన్నీ బుక్ అయ్యాయని అనుకుంటే వచ్చే ఆదాయం రూ.1.6 లక్షలు. కానీ ఆ రూముల నిర్వహణకు నెలకు రూ.2 లక్షలు ఖర్చు చేస్తున్నారు. సబ్బులు, క్లీనింగ్ అని ఆదాయం కంటే ఎక్కువ చూపిస్తున్నారు. వాటిని సరఫరా చేసే సంస్థ నుంచి కూడా కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ప్రధాని సభకు విస్తృత ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి జిల్లా నుంచి 40 వేల మందిని సమీకరించేందుకు నిర్ణయించామన్నారు. సభకు వచ్చే వారికి రవాణా, భోజన సదుపాయం కోసం చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. నగర సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ 22 ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలని విశాఖ కలెక్టర్, నగర సీపీలను ఆదేశించారు. ప్రధాని ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన సంపత్ వినాయక్ ఆలయం వద్దకు చేరుకుని అక్కడ నుంచి ఓపెన్‌టాప్ వాహనంపై బహిరంగ సభ జరిగే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకూ రోడ్‌షో నిర్వహిస్తారన్నారు. సంపత్ వినాయక్ ఆలయం నుంచి సభా ప్రాంగణం వరకూ విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. సభకు అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే వారికి భోజన వసతి కల్పించాలని, వచ్చే వారంతా సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మహా గోప్యం!

... 5వ పేజీ తరువాయి

అధికారులు చెల్లింపులు జరుపుతుంటారు.

జీవీఎంసీలో ఇష్టారాజ్యం

జీవీఎంసీలో ప్రస్తుతం బిల్లుల చెల్లింపు పరిశీలిస్తే ఫిబ్రవరిలో ఓచర్ రైజ్ అయిన పనులకు బిల్లులు చెల్లించేశారు. ఆ తర్వాత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలోని కొందరు పెద్దలు జీవీఎంసీ బిల్లుల చెల్లింపులో కీలకంగా వ్యవహరించే అధికారులను ప్రసన్నం చేసుకుని, అక్టోబరులో ఓచర్ రైజ్ అయిన పనులకు అడ్డదారిలో పేమెంట్లు తీసుకున్నారు. మరికొంతమంది ప్రజా ప్రతినిధులతో సిఫారసు చేయించుకుని బిల్లులు చేసుకున్నారు. దీనివల్ల పది నెలల కిందట పని పూర్తిచేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ అధికారులతోపాటు కాంట్రాక్టర్లలో కలకలం రేగింది.

చక్రం తిప్పిన అధికారులు

అడ్డదారిలో బిల్లులు చేసిన వైనం పూర్తి ఆధారాలతో వెలుగుచూసిన నేపథ్యంలో దానికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు, అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకున్నారు. బిల్లుల చెల్లింపు, ఏ బిల్లు చెల్లింపు ప్రక్రియ ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందనే వివరాలు ఇంజనీరింగ్ అధికారులతోపాటు డ్రాయింగ్ బ్రాంచిలోని అధికారులు, సిబ్బందికి కూడా తెలియకుండా పోర్టల్‌లో మార్పులు చేశారు. బిల్లుల వివరాలు కేవలం అదనపు కమిషనర్ (ఫైనాన్స్), అకౌంట్స్, ఐటీ విభాగాల సిబ్బంది మాత్రమే చూసేలా యాక్సిస్‌లో ఉంచారు. మిగిలిన ఇంజనీర్లు, డ్రాయింగ్ బ్రాంచిలకు ఆ అవకాశం లేకుండా చేశారు. దీనివల్ల బిల్లుల చెల్లింపులో ఎన్ని అక్రమాలు జరిగినా బయటకు తెలిసే అవకాశం లేకుండాపోయింది.

నేడు నేవీ విన్యాసాలు

... 5వ పేజీ తరువాయి

విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళతారు.

సీఎం, డిప్యూటీ సీఎం కుటుంబ సభ్యులతో రాక

నేవీ ఆపరేషన్ డెమోకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆయన సతీమణి, పిల్లలు రానున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శుక్రవారం రాత్రే నగరానికి చేరుకున్నారు.

ఉక్కు ఉద్యోగుల బైక్ ర్యాలీ 6వ తేదీకి వాయిదా

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి) : ఉద్యోగులకు పూర్తిస్థాయి వేతనాలు సకాలంలో చెల్లింపు, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం చేపట్టనున్న ద్విచక్ర వాహనాల ర్యాలీని వాయిదా వేసినట్టు ఉక్కు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు తెలిపారు.ఈ ర్యాలీని ఉక్కు దీక్షా శిబిరం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే శనివారం ర్యాలీ నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవటంతో ఈనెల 6 (సోమవారం)కు వాయిదా వేసినట్టు ఆయన వెల్లడించారు.

వాసవీ సేవా ట్రస్ట్ వితరణ

పెదగంట్యాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నడుపూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అమ్మవాసవీ సేవా ట్రస్ట్ భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసింది. జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారాలు అందించడం అవసరమన్నారు. ఎంఈవో ఇ.శీనివాసరావు, హెచ్ఎం రమణమ్మ, సేవాట్రస్ట్ సభ్యులు రామానుజస్వామి, బెల్లాల పెంటబాబు, డాక్టర్ కులుకూరి మంగరాజు, బొడ్డు కృష్ణారావు, వెంకటరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. కీర్తి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించండి

» జీవీఎంసీ కమిషనర్‌కు కూటమి నేతల వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నేతలు

అగనంపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి, పరిసర ప్రాంత గ్రామాల్లో గల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ సంపత్‌కుమార్‌కు స్థానిక కూటమి నేతలు శుక్రవారంవినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా జరిగేలా పైపులైన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్మశాన వాటిక నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారిలో వీధి లైట్లు వేయాలన్నారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు నేతలు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన వారిలో ఇల్లపు ప్రసాద్, బి.సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, చందురమేశ్ తదితరులు ఉన్నారు.

శరవేగంగా ఆర్వోబీ పనులు

» 10 నెలల్లో అందుబాటులోకి రానున్నట్టు ఐలా కమిషనర్ ప్రకటన
» చుక్కవానిపాలెం రైల్వే గేటు వద్ద తీరనున్న ట్రాఫిక్ సమస్య



చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు



రైల్వే క్రాసింగ్ గేటు పడడంతో నిలిచిపోయిన వాహనాలు

ఆటోనగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్న డి బ్లాక్‌లోని చుక్కవానిపాలెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద చేపట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రైల్వే మార్గంలో ప్రతిరోజూ సుమారు 200 వరకూ గూడ్సు రైళ్లు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో గేటుకు ఇరువైపులా సుమారు 30 నిముషాలు పాటు వాహనాలను నిలిపి వేస్తుండటంతో వాహనదారులు, పదుల సంఖ్యలో ఉన్న పరిసర గ్రామాల ప్రజలు, పలు ఇంజనీరింగు కళాశాలలు, స్కూళ్లు, వీఎస్ఈజడ్, ఆటోనగర్ కర్మాగారాల కార్మికులు, దువ్వాడ రైలు ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైవేస్ అండ్ సీఆర్ఎఫ్ సేతుబంధన్ ప్రాజెక్టులో భాగంగా ఆటోనగర్‌లో ఫ్లైఓవర్ వంతెన పనులు చేపడుతున్నారు. తొమ్మిదేళ్ల కిందట రైల్వే అధికారులు, ఆర్వోబీ పనులు పూర్తి చేశారు. అయితే రైల్వే క్రాసింగ్‌కు ఇరువైపులా రోడ్డుకు అనుసంధానం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. నిధుల లేమితో ఆ పనులు అటకెక్కాయి. గత, ప్రస్తుత ఐలా పాలక వర్గాలు సమస్య తీవ్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించాయి. ఎట్టకేలకు నిధులను కేటాయించటంతో విద్యుత్ స్తంభాలను మరో పక్కకు జరిపి, నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ పనులు జరుగుతున్న తీరును ఎప్పటికప్పుడు ఐలా కమిషనర్, కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరో 10 నెలల్లో ఆర్వోబీ అందుబాటులోకి రానుందని ఐలా కమిషనర్ ఎ.కిషోర్, కమిటీ సభ్యులు తెలిపారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు



హరిజన జగ్గయ్యపాలెంలో ఆక్రమణలపై రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీవల్లికి ఫిర్యాదు చేస్తున్న ఎస్సీ సంఘ నేతలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు తమ రెవెన్యూ సమస్యలతో పాటు ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కూడా ఫిర్యాదు చేయవచ్చని గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి కోరారు. జీవీఎంసీ 69వ వార్డు శీలానగర్‌లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానికులు.. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికంగా ఫిర్యాదులు చేశారు. ఈ సదర్భంగా శ్రీవల్లి మాట్లాడుతూ ఈ విధంగా చేయడం వల్ల సామాజిక బాధ్యతను నిర్వర్తించిన వారవుతారన్నారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు చక్కని వేదికలు అన్నారు. హరిజన జగ్గయ్యపాలెం సర్వే నెంబరు 4/1లోని ప్రభుత్వ భూముల్లో కొందరు షెడ్లు వేసి వ్యాపారంచేస్తున్నారని హరిజన జగ్గయ్యపాలెం నాయకులు ఫిర్యాదు చేయగా, తుంగ్లాం సర్వే నెంబరు 25లోని ఏపీఐఐసీ భూమిలో కొందరు నకిలీ పత్రాలు సృష్టించి వ్యవసాయం పేరుతో ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని తుంగ్లాంకు చెందిన నాయకులు అధికారులకు పిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అలమండ రాజు, వంకినేని జీవన్‌బాబు, జి.రామాంజనేయులు, ఎం.నిర్మలాకుమారి, ఎం.ఆనంద్, జోషప్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

పెదగంట్యాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నడుపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలోసావిత్రిబాయిపూలే జయంతిని శుక్రవారం ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురాం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 42 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయుడు నరసింహ తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, టీడీపీ నేతలు ప్రసాదుల, కృష్ణ తదితరులు

గాజువాక : స్థానిక టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు.ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు అంగ కృష్ణ, బలగ బాలునాయుడు, కోటేశ్వరరావు, రట్టి వాసు పాల్గొన్నారు.

అగనంపూడి : జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి సత్రం జంక్షన్‌లో గల మహాత్మా గాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అప్పారావు, మోహన్‌రావు, వినోద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం : మింది ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పీవీఎస్ఎస్ ఆంజనేయ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించి నివాళి అర్పించారు. హైస్కూల్‌లోని మహిళా ఉపాధ్యాయులను స్కూల్ కమిటీ ఘనంగా సత్కరించింది.

ఒడిశా గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు



గవర్నర్ హరిబాబును కలిసి అభినందనలు తెలుపుతున్న బీజేపీ నేతలు మాధవ్, నాగేంద్ర, నరసింగరావు, తదితరులు

గాజువాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కంభంపాటి హరిబాబును శుక్రవారం భువనేశ్వర్‌లో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో నాయకులు మాజీ ఎమ్మెల్సీ మాధవ్, నాగేంద్ర, నాగేశ్వరరావు, దిలీప్, వంశీ, రాంబాబు, అనీల్ ఉన్నారు.

సంక్రాంతి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గాజువాక లంకా మైదానంలో ఎస్వీ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు.ఈనెల 12 నుంచి 16 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ప్రథమంగా నిలవాలి

టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి సూర్యనారాయణ



కార్యకర్తలకు సూచనలిస్తున్న సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గాజువాక నియోజక వర్గంలో సభ్యత్వ నమోదులో 86వ వార్డు ప్రథమ స్థానంలో నిలిచేలా టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా శ్రమించాలని టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మాతృశ్రీ నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేశంలో జాతీయ పార్టీలకు టీడీపీ రోల్ మోడల్‌గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడిపి నాయకులు వేగుంట శ్రీనివాస్, నాగార్జున, వెంకట సుబ్బయ్య, లోవరాజు. జగదీష్, రాధ, బొబ్బిలి శ్రీను, అప్పారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీల కో-ఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు



ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర ప్రదేశ్‌లోని బరేల్లిలో ఈనెల 7 నుంచి 13 వరకు జరగనున్న సీనియర్ మెన్ జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల కో-ఆర్డినేటర్‌గా ఆంధ్రప్రదేశ్ నుంచి స్టీల్‌ప్లాంట్ బాక్సింగ్ కోచ్ కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు.స్టీల్‌ప్లాంట్ ఉద్యోగిగా, జాతీయ స్థాయి కోచ్‌గా శ్రీనివాసరావు పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం జాతీయ స్థాయి కోచ్‌గా నియమితులు కావడంతో శ్రీనివాసరావును పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

'ఉద్యోగులను వేధింపులకు గురిచేయొద్దు'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను మానసికంగా వేధించవద్దనిఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య అన్నారు.వేతనాలు పూర్తిగా సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్లాంట్ టీటీఐ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఆర్ఎల్‌సీ, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశామన్నారు.బ్యాంకులకు డిఫాల్టర్‌లుగా మారుతున్నామన్నారు. పిల్లలకు ఫీజులు కూడా కట్టలేని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు నేతలు బొండా తౌడన్న, దాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు నడుపూరు విద్యార్థులు



అవార్డు అందుకుంటున్న నడుపూరు హైస్కూల్ విద్యార్థులు

పెదగంట్యాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి విద్యవైజ్ఞానిక ప్రదర్శన గ్రూపు కేటగిరిలో నడుపూరు జిల్లాపరిషత్తు విద్యార్థులు ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి విద్యవైజ్ఞానిక ప్రదర్శనలో నడుపూరు హైస్కూలు విద్యార్థులు తరుణ్, యశస్విని రూపొందించిన యాంటీ స్లీప్ అలారం మొదటి బహుమతి సాధించింది. సైన్స్ ఉపాధ్యాయని ఎంఆర్‌సీ లక్ష్మి వీరికిగైడ్ గా వ్యవహరించారు.

షిప్ యార్డు ఉద్యోగులకు మెరుగైన వైద్యం

మల్కాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ ఉద్యోగులకు, ఎల్అండ్ఎం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇకపై మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. తొలిసారిగా హెచ్ఎస్ఎల్ యాజమాన్యం ఉద్యోగులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఈనెల 1న ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులు, వారి కుటుంబీకులకు ఎంత ఖరీదైన వైద్యం అయినా చేయించుకోవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఎల్అండ్ఎం సిరిస్ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటివరకు ఉద్యోగులు స్థానికంగా ఉన్న ప్యానల్ డాక్టర్లు, సెయింట్ ఆన్స్ ఆస్పత్రిలో వైద్యం పొందేవారు. వారికి కార్పొరేట్ వైద్యం అందేది కాదు. ఈ విషయాన్ని కార్మిక సంఘాల నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఎట్టకేలకు స్పందించారు. ఉద్యోగులు ఇకపై నగరంలోని ఇండస్ ఆస్పత్రి, శంకర్ ఫౌండేషన్, ఆర్‌కే ఆస్పత్రి (గాజువాక), దేముడుబాబు కమల నర్సింగ్ హోమ్ (మర్రిపాలెం), ఎంజీఎం సెవెన్ హిల్స్ (విశాఖపట్నం) ఆస్పత్రిలో వైద్య సేవలు పొందవచ్చు. ఇన్ పేషెంట్‌గా ఉన్నంత వరకు వైద్యం, శస్త్రచికిత్స, మందులు అన్నీ షిప్ యార్డు భరిస్తుంది. పేషెంట్ ఉన్న రూమ్ అద్దె మాత్రం ఉద్యోగి భరించాలి. ఉద్యోగి ముందు రూమ్ అద్దె చెల్లించిన తరువాత ఆ రూమ్‌కు ఎంత ఖర్చు అయ్యిందో బిల్లు పెట్టుకుంటే ఆ బిల్లును కూడా యాజమాన్యమే భరిస్తుంది.

'వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి'

సిరిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన వలంటీర్ వ్యవస్థ కొనసాగింపు హామీని నెరవేర్చాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర వ్యాప్త పిలుపులోభాగంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు రూ.పది వేలు జీతాలు ఇచ్చి వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని చంద్రబాబు చెప్పారని పేర్కొన్నారు. కానీ ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఈ విషయమే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారిధిగా పని చేసే వలం టీర్లను తొలగించడం అన్యాయమన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.మణి, వలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి దీప్తి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాడుతామన్నారు. మహిళలపై ఏమాత్రం గౌరవం ఉన్నా వలంటీర్లు అందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, పార్వతి, లక్ష్మణ్, ఆదిలక్ష్మి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



జుత్తాడలో రెవెన్యూ సదస్సు



సదస్సులో పాల్గొన్న అధికారులు

పెందుర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జుత్తాడలో సర్పంచ్ బొడ్డు వాణిప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎన్‌హెచ్ 16 ఎస్‌డీసీ సీతారామారావు సదస్సుకు హాజరై, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ తహసీల్దార్ అనంద్‌కుమార్ ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు పాల్గొన్నారు.

సైన్యంలో మహిళలకు అవకాశాలు

మల్కాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భారత సైన్యంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి అన్నారు. శుక్రవారం ఆ కళాశాల విద్యార్థినులకు సైనిక అధికారులతో ముఖా-ముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుద్ధంలో వీరోచిత సేవలందించిన ప్రముఖులు విద్యార్థినులతో తమ అనుభవాలను పంచుకోవడం స్ఫూర్తిదాయకమని చెప్పారు.అనంతరం మాజీ సైనిక అధికారులు లెఫ్టినెంట్ జనరల్ అట్లూరి ఉత్తమ్, జీఎం నాయర్, ఎస్. రవిశంకర్, కల్నల్ విసి భట్, గ్రూప్ కెప్టెన్ కెట్కర్, తదితరులు యుద్ధ సమయంలో సైన్యం చూపించిన ధైర్య సాహసాలను, ఐక్యతను, దేశభక్తిని వివరించారు. అలాగే సైన్యంలో మహిళలకు ఉన్న అవకాశాలను తెలియజేశారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
● **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **యువి :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 36, టమాటా 14, వంకాయలు(తెలుపు) 34,వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 44 దొండకాయలు 44, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో)65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 36, వె ల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4,మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తరువాత గోదాదేవికి విశేష అర్చనలు చేశారు. అనంతరం తిరుప్పావై పఠించారు.

వేపగుంట : నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో కూడా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గోదాదేవికి ప్రత్యేక పూజలు, స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అనంతరం తిరుప్పావైలో 19వ పాశురం అమ్మవారికి విన్నవించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శ్రీనివాసస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. 98వ వార్డు శ్రీ లక్ష్మీనరసింహనగర్‌లో ఉన్న గోపీ జనవల్లభ స్వామి ఆలయంలోనూ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

ఎన్‌ఏడీ జంక్షన్ : విమాన్‌నగర్‌లో ఉన్న వైకుంఠ వెంకటేశ్వరాలయంలో కూడా ధనుర్మాస వేడుకలు కొనసాగుతున్నాయి. స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, సారె సమర్పించారు.ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆర్పీపేట (కంచరపాలెం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 56, 57 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. 56 వార్డులో ఆర్పీపేట, దుర్గానగర్, గౌరీ నగర్‌లో రోడ్డు, కాలువలు, గెడ్డకు మరమ్మతు పనులకు సుమారు రూ. 30 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ప్రారంభించారు. అలాగే 57వ వార్డు తుమ్మడిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు శంకుస్థాపన చేశారు.

'మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థిక వేత్త'

మల్కాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక వేత్త అని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో మన్మోహన్ సింగ్ జీవిత చరిత్రపై, ఆయన దేశానికి చేసిన సేవలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకుడు బిపి రాజు, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపీఎస్ బాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవీ, అధ్యాపకులు డి. జయశ్రీ, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

12న గాజువాకలో 5కె రన్

మల్కాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని ఈనెల 12న గాజువాక ఆర్టీసీ డిపో నుంచి మల్కాపురం వరకు మారథాన్ నిర్వహించనున్నట్టు స్వామి వివేకానంద ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు తెల్లవారుజామున 5:30 గంటలకు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద నుంచి 5కె రన్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే

మల్కాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త,తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే దేశానికి చేసిన సేవలు మరువలేనివని ములగాడ తహసీల్దార్ భుజంగరావు అన్నారు. శుక్రవారం మాజీ సైనికుల కాలనీ సమీపంలో ఉన్న వెంకటేశ్వరస్వామి కాలనీలో స్థానిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు నడుపూరి వెంకటరమణ,వీరన్నరెడ్డి, దాకరపు నూకరాజు, మహిళ నాయకులు కుమారి, రాజేశ్వరి, శ్రీదేవి పాల్గొన్నారు.అలాగే సీపీఎం కార్యాలయంలోనూ సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె. పెంటారావు, నాయకులు సత్యరావు, లక్ష్మణమూర్తి, పైడిరాజు, రాము, ఏసుబాబు, బుజ్జి, గంటిదాసు, ప్రశాంత్, శ్రీను పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లికి పూజలు

వేపగుంట, జవవరి 3 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 98వ వార్డు శ్రీనివాసనగర్‌లో కొలువైన సత్తెమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 200 మందికి అన్నసంతర్పణ చేశారు.

జనారణ్యంలోకి వన్యప్రాణులు

కంబాలకొండ అటవీ ప్రాంతంలో ఆహార కొరత

- జాతీయ రహదారిపై సంచరిస్తున్న జింకలు
- ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు



ఎండాడ జాతీయ రహదారిపైకి తరచు రాత్రుళ్లు వస్తున్న జింకలు

ఎండాడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అడవిలో స్వేచ్ఛగా విహరించాల్సిన వన్యప్రాణులు జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. అడవులను ఇష్టారాజ్యంగా నరికివేయడం, పర్యాటక స్థలాలుగా తీర్చిదిద్దే క్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులు అడవి ప్రాణులకు ఆహారం లేకుండా చేస్తున్నాయి. దీంతో అవి ఆహారాన్వేషణలో భాగంగా రహదారులపై సంచరిస్తూ ప్రమాదాలబారిన పడుతున్నాయి. నగరంలోనే ఏకైక అటవీ ప్రాంతమైన కంబాలకొండలో ఎన్నో రకాల జంతువులు ఆశ్రయం పొందుతున్నాయి. వీటిలో అధికశాతం జింకలు, దుప్పిలున్నాయి. వీటికి తగిన ఆహారం లభించకపోవడంతో రాత్రి సమయంలో ఎండాడ సమీపంలోని జాతీయ రహదారిపైకి చేరుతున్నాయి. ఇది నిత్యకృత్యమవుతున్నా అటవీశాఖాధికారులు దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తీవ్ర ఆహార కొరతతో కంబాల కొండ అటవీ ప్రాంతంలో జీవిస్తున్న పలు జంతువులు అటు జూపార్కు నుంచి ఇటు ఎండాడ పెట్రోల్ బంక్ వరకు రాత్రి వేళల్లో జాతీయ రహదారి మీదకు వస్తున్నాయి. ఆ సమయంలో వెళ్లే వారు వాటిని చూసి ఫొటోలు తీసుకుంటున్నారు. అయితే ఆహారాన్వేషణలో భాగంగా జాతీయ రహదారిపైకి చేరుతుండడంతో వన్యప్రాణులు ప్రమాదాల బారిన పడుతున్నాయి.

కంబాల కొండ విస్తీర్ణం సుమారు 70 చదరపు కిలోమీటర్లు. ఈ పరిధిలో అనేక వన్య ప్రాణులు ఆవాసాలను ఏర్పర్చుకున్నాయి. ఇటీవల జింకలు గుంపులుగా జాతీయ రహదారిపైకి పరుగులు తీస్తున్నాయి. తీవ్రమైన ఆహార కొరతతో ఇవి ఇలా జనారణ్యంలోకి వస్తున్నాయి. వీటిని సంరక్షించాల్సిన అటవీ శాఖాధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులకు అవసరమయ్యే పచ్చని గడ్డి (గ్రాసం), దాహార్తిని తీర్చుకునేందుకు నీరు లభించకపోవడంతో ఆహారం కోసం ఇలా రోడ్డుపైకి చేరుతున్నాయి.

ప్రమాదం అంచున

జాతీయ రహదారిపై తరచు రాత్రి వేళల్లో జింకలు సంచరిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి .రోడ్డుదాటే క్రమంలో వాహనాలు ఢీకొంటున్నాయి. పైగా అవి వాహనాల కింద పడి ప్రమాదాల బారిన పడుతున్నాయి.అలానే కుక్కలు దాడిచేస్తున్నాయి. దేశవ్యాప్తంగా వన్య ప్రాణుల ఆధారిత పర్యాటకం గణనీయమైన ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. విశాఖలోని జూపార్కు, కంబాలకొండకు పర్యాటకుల సంఖ్య బాగుండడంతో మెరుగైన ఆదాయం లభిస్తోంది. అయినప్పటికీ వన్యప్రాణుల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు తీసుకుంటే మేలు...

అడవుల్లో డిజిటల్ పరికరాలను వినియోగించడం ద్వారా వన్య ప్రాణుల సమస్యలు, సంచారం, ఆవాసానికి ఎదురవుతున్న కష్టాలను గుర్తించేలా చర్యలు తీసుకోవాలి.కంబాల కొండ అటవీ ప్రాంతంలో తీవ్రమైన ఆహార కొరత ఉంది. జింకల సంతతి పెరగడంతో వాటికి సరిపడా ఆహారం, నీరు లభించడం లేదు. జింకలు తినే గడ్డి లభించకపోవడంతో జాతీయ రహదారి పక్కన పండ్ల దుకాణాల్లో కుళ్లిపోయిన వాటిని పడేస్తుండగా వాటిని తినేందుకు రోడ్డెక్కుతున్నాయి. అటవీ ప్రాంతం నుంచి రోడ్డుపై తగిన ఫెన్సింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నా..

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

డాబాగార్డెన్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, సుప్రీంకోర్టు వ్యాఖ్యలను కూడా తాము ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కల కోసం ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వ్యక్తితో ఏపీలో ఏకసభ్య కమిషన్ వేయడం సరికాదన్నారు. గ్రామ సచివాలయాల సిబ్బందితో జనగణన చేపట్టడంపైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ లెక్కలకు విలువ ఉండదన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై పోరాటం చేస్తామన్నారు. గగనంలో ఉన్న సునీతా విలియమ్స్‌ను రిమోట్‌తో ఆపరేట్ చేస్తున్న ఈ రోజుల్లో ఈవీఎంలను తమకు నచ్చినట్టు ఆపరేట్ చేయలేరా?...అంటూ ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీకి నైతిక విలువలు లేవని చింతా మోహన్ మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై శనివారం విశాఖ పర్యటనకు రాబోతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించాలని కోరుతున్నానన్నారు. విశాఖకు ప్రధాని మోదీ రానున్న నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ కొనసాగింపుపై హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని, పార్టీకి సరైన నాయకత్వం లేదని చింతా మోహన్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు గార సూర్యారావు, అబీదా తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటాలి

- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు
- తోటగరువు ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన





ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, డీఈవో ప్రేమ్‌కుమార్, బయోమెట్రిక్ విధానంపై గాజువాక పాఠశాల విద్యార్థుల వివరణ

ఆరిలోవ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికితీసి, ఉత్తమ ప్రాజెక్టులను రూపొందించి జాతీయస్థాయిలో సత్తా చాటాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ముందుగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించి, ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు లభించేలా ఇలాంటి ప్రదర్శనలను తరచూ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 11 మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు 33 ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు హాజరవుతారని, అక్కడ ఎంపికైతే జాతీయస్థాయికి వెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్, ఒమ్మి సన్యాసిరావు దర్మారావు, గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, సురేష్, గోవింద్ జాన్ ప్రసాద్, ఎంఈవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగా భవానీ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఎమ్మెల్యే, డీఈవో పరిశీలించారు.



ఫార్మా సిటీలో ప్రమాదాల నివారణపై రూపొందించిన ప్రాజెక్టు

విజేతలు వీరే...

స్టూడెంట్ ఇండివిడ్యువల్‌లో పెందుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థి రూపొందించిన మల్టీ పర్పస్ అగ్రికల్చర్ రోబోకు ప్రథమ స్థానం లభించింది. ఉపాధ్యాయుడు బీఎం పట్నాయక్ గైడ్‌గా వ్యవహరించారు. శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకులం విద్యార్థి పి.ఆకాష్ తయారుచేసి మేథమెటికల్ మోడలింగ్ స్వచ్ఛభారత్‌కు ద్వితీయ బహుమతి దక్కింది. గైడ్‌గా బి.లక్ష్మణరావు వ్యవహరించారు. కేటగిరీ స్టూడెంట్స్ గ్రూప్‌లో పెదగంట్యాడ విద్యార్థులు జి.తరుణ్‌కుమార్, ఎస్.యశస్వి తయారుచేసిన యాంటీ స్లీప్ అలారం ప్రాజెక్టుకు ప్రథమం లభించింది. ఉపాధ్యాయుడు ఆర్‌వీ సురేష్ సారథ్యంలో రూపొందించారు. మేహాద్రిపేటపేటగురుకులం విద్యార్థినులు కె.లోహిత,వై.హిమ బిందు రూపొందించిన ఆటోమెటిక్ సేఫ్టీ మోనటరింగ్ అండ్ ప్రివెన్షన్ సిస్టమ్ ద్వితీయస్థానం లో నిలిచింది. టీచర్ కె.రమణమ్మ గైడ్‌గా వ్యవహరించారు. టీచర్ కేటగిరీ విభాగంలో ఆటోమేటిక్ ట్రెయిన్ కొల్లిసన్ సిస్టమ్‌నకు శ్రీకృష్ణాపురం బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు బి.సీతారాం రూపొందించిన ప్రాజెక్టుకు ప్రథమం, అగనంపూడి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురా లు పి.కృష్ణవేణి తయారుచేసిన కన్సర్వేషన్ ఆఫ్ ఫుడ్ అండ్ వాటర్ ప్రాజెక్టునకు ద్వితీయస్థానం వచ్చాయని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

గ్రావెల్ తరలింపులో ఏడుగురికి నోటీసులు

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌కు అవసరమైన గ్రావెల్‌ను పర్మిట్‌లేకుండా సమీప కొండ నుంచి తరలించిన ఏడు కంపెనీలకు నోటీసులు జారీచేశామని గనులు శాఖ ప్రాంతీయ విజిలెన్స్ ఏడీ బి.అశోక్‌కుమార్ తెలిపారు. గుర్రంపాలెం పారిశ్రామికలేఅవుట్‌లో ప్లాట్ల ఫిల్లింగ్‌కు ఏడు పారిశ్రామిక కంపెనీలు అనుమతి లేకుండా కొండ నుంచి గ్రావెల్ తవ్విన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించి గత నెలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నోటీసులిచ్చామని, ఉన్నతాధికారుల అనుమతితో షోకాజ్, జరిమానా నోటీసులు ఇస్తామన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడలో అనుమతి లేకుండా గ్రావెల్ తరలించి లేఅవుట్ లెవెల్ చేస్తున్న యజమానులకు రూ.లక్ష జరిమానా విధించామన్నారు.

మహిళా అభ్యర్థులకు పరీక్షలు



లాంగ్ జంప్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాక్షినగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కైలాసగిరి రిజర్వు పోలీసు మైదానంలో శుక్రవారం మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో తొలి రోజు హాజరైన 278 మందికి పరీక్షలు నిర్వహించారు. కాగా పురుషుల దేహదారుఢ్య పరీక్షలు నాలుగో రోజు కొనసాగాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్‌బీ, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్‌లు బాలసూర్యారావు టి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఇన్‌చార్జి మంత్రి నివాళి



పూలేకు నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, సీపీ, ఎమ్మెల్యేలు

మహారాణిపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళాభ్యుదయానికి ఆమె చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

'హైందవ శంఖారావానికి తరలిరండి'

సీతమ్మధార, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభకు విశాఖ నుంచి పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు హాజరు కావాలని విశ్వ హిందూ పరిషత్ నగర అధ్యక్షుడు కందర్ప విశ్వనాథ్ కోరారు. 82 బస్సులు, వందల కార్లు, 3 ప్రత్యేక రైళ్లు, సాధారణ రైళ్లలో విజయవాడ చేరేలా కార్యక్రమం రూపొందించామన్నారు.ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నేతలను ఆహ్వానించామన్నారు. విశ్వహిందూ పరిషత్ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం విజయవాడ సమీపంలోని గన్నవరం కేసనపల్లి వద్ద జరగనుందన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ అన్నే బాబ్జి పాల్గొన్నారు.

టీసీఎఫ్‌ఏ, ఎస్‌పీఎంసీ ఎఫ్‌సీ ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా శుక్రవారం టీ కోర్టు ఫుట్‌బాల్ సంఘం (టీసీఎఫ్‌ఏ), ఎస్‌పీఎంసీ చిట్టివలస జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ డ్రా అయింది. మ్యాచ్ ఆద్యంతం ఇరుజట్ల ఆటగాళ్లు హోరాహోరీగా తలపడ్డారు. ప్రత్యర్థులపై వరుస దాడులు చేసినా నిర్ణీత సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు గోల్ సాధించలేకపోయారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. మరో మ్యాచ్‌లో దుర్గాలమ్మ ఎఫ్‌సీ 1-0 గోల్ తేడాతో సీహెచ్‌ఎస్‌ఎం ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లకు టోర్నీ నిర్వాహకులు నీలాద్రి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చినబాబు, రామకృష్ణ త్రినాథరావు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న నీలాద్రి

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

పెందుర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన అప్పన్నపాలెం వద్ద శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కొయ్యిబోయిన అప్పయమ్మ (73) రహదారి దాటుతుండగా వేపగుంట నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది, బైక్ నడిపిన వ్యక్తికి గాయాలయ్యాయి. సీఐ కేవీ సతీశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌పై కేసు నమోదు

గోపాలపట్నం, జనవరి 3 (ఆన్‌లైన్): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఎ.అవినాష్ కేటరింగ్ పనులకు వెళ్తుంటాడు. కొంతమందితో కలిసి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు సమాచారం అందడంతో గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. సీఐ జి.అప్పారావు కేసు నమోదు చేశారు. ఇందులో మరికొందరు ఉన్నారని, వారికోసం గాలిస్తున్నామన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం: ఇద్దరికి జైలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన తండ్రి, కుమారులకు కోర్టు జైలు శిక్ష విధించింది. కలపాకకు చెందిన స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి ఎన్.పోతయ్య, అతని కుమారుడు ఎన్.వెంకటరమణ (ఉక్కు కాంట్రాక్టు కార్మికుడు) ఉద్యోగాల పేరుతో 50 మంది నుంచి సుమారు రూ.63 లక్షలు వసూలు చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో తండ్రీ కుమారులకు ఏసీఐఎం కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించిందని స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు.

పాఠశాలలో మత ప్రచారంపై విచారణ

ఆనందపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమన్నదొరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులే మత ప్రచారం చేస్తున్నట్టు అందిన ఫిర్యాదులపై శుక్రవారం ఎంఈవో గంగరాజు విచారణ చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు గత నెలలో విద్యార్థులతో కలిసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించి, మత ప్రచారం చేశారని గ్రామస్థులు ఆందోళన చేయడంతో హిందూ పరిషత్, భజరంగ్ దళ్ సభ్యులు నిలదీశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల వాగ్మూలాన్ని నమోదు చేశామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఎంఈవో తెలిపారు.

పోర్టులో అప్రంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీలో ట్రేడ్ అప్రంటిస్‌షిప్‌ల కోసం ఐటీఐ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వెల్డర్, ఎలక్ట్రీషియన్. ఫిట్టర్, మోటార్‌మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడుల్లో డిప్లమో పొందిన వారు అర్హులు. శిక్షణ కాలం ఏడాది. ఎంపికైన వారికి నెలకు రూ.8,366.60 నుంచి రూ.9387.67 వరకు స్టైఫండ్ చెల్లిస్తుంది. అభ్యర్థి వయసు 31.12.2024 నాటికి 14ఏళ్లు దాటి ఉండాలని, ఈనెల 18లోగా www.apprentishipindia.gov.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

7 నుంచి విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వసూలుచేసే విద్యుత్ చార్జీలపై ఈ నెల ఏడు, ఎనిమిది, పదో తేదీల్లో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు సమర్పించిన టారిఫ్‌లపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో పాల్గొనవచ్చు. ఏడు, ఎనిమిది తేదీల్లో విజయవాడ బృందావన కాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్ నుంచి, పదో తేదీన కర్నూలు విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అభిప్రాయాలు తెలుసుకుంటారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ (ఇన్‌ఛార్జి) ఠాకూర్ రామ్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. అభిప్రాయాలు చెప్పదలుచుకున్నవారు సమీప ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం లేదా డివిజన్ కార్యాలయంలో హాజరు కావచ్చునని సీఎండీ తెలిపారు.

41 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

వెంకోజీపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని చైర్మన్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అజెండాలోని 42 అంశాలకు 41 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగంలో పనులున్నాయన్నారు. సమావేశంలో సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.